TGTEL/25/A0977

# తొవ్వ

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 90 | శుక్రవారం 28-11-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## మరో గ్రామం ఏకగ్రీవం

### ఆదిలాబాద్ జిల్లా తేజాపూర్ ఏకగ్రీవానికి అంగీకారం

**ఆదిలాబాద్,నవంబర్27:** తెలంగాణ పల్లెల్లో ప్రజాస్వామ్య ఎన్నికల సందడి మొదలైంది. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభం కావడంతో రాష్ట్రం మొత్తం ఎన్నికల వాతావరణం లోకి ప్రవేశించింది. దీనితో సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమయ్యింది. నామినేషన్ రోజు మరో సర్పంచ్ ఏకగ్రీవమయ్యారు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలంలోని తేజపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది. సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను సైతం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తేజపూర్ గ్రామపంచాయతీకి పరిధిలోని సాలెగుడా, డోబ్బిగూడ , తేజపూర్ గ్రామ పటేల్‌ల ఆధ్వర్యంలో సమావేశమై స్వచ్ఛందంగా ఎన్నికలు నిర్వహించకుండా కోవా రాజేశ్వర్‌ను సర్పంచ్‌గా మరో 8 మంది వార్డు సభ్యులను ఎన్నుకున్నారు. మరోవైపు.. రాజన్న సిరిసిల్ల జిల్లాలో పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన రోజునే తొలి ఏకగ్రీవ ఎన్నిక నమోదు అయింది.

## కేసీఆర్ ఓఎస్‌డీని విచారించిన సిట్

### ఫోన్ ట్యాపింగ్ కేసుపై విచారణ


### రెండు గంటల పాటు కొనసాగిన విచారణ

**హైదరాబాద్,నవంబర్27:** తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు మళ్లీ వేగం పుంజుకుంది. ఈ కేసు విచారణలో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యక్తిగత సహాయకుడిగా (ఓఎస్‌డీ) పనిచేసిన రాజశేఖర్ రెడ్డిని ప్రశ్నించింది. జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ విచారణలో అధికారులు కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నూతన పోలీస్ కమిషనర్‌గా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ కేసుపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి, దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలోనే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అత్యంత కీలకంగా వ్యవహరించిన రాజశేఖర్ రెడ్డిని సిట్ విచారణకు పిలవడం ప్రాధాన్యత సంతరించుకుంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ విభాగం ద్వారా రాజకీయ ప్రత్యర్థులు, వ్యాపారవేత్తలు, మీడియా ప్రతినిధుల ఫోన్లను అక్రమంగా ట్యాప్ చేశారన్నది ప్రధాన ఆరోపణ.

# యువత వల్లే స్టార్టప్ విప్లవం..

## ప్రపంచానికే ఆదర్శం మన యువత

- దేశంలో 1.5 లక్షల స్టార్టప్‌ల ఏర్పాటు
- మూడో అతిపెద్ద వ్యవస్థగా భారత్
- ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు



**న్యూఢిల్లీ,నవంబర్ 27:** భారత యువత, ముఖ్యంగా జెన్-జెడ్ (%+వఅ్గ%) తరం వారి ఆత్మవిశ్వాసం, సామర్థ్యం ప్రపంచానికే ఆదర్శమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. వారి సానుకూల దృక్పథం, సృజనాత్మకత ప్రపంచ యువతకు ఒక బెంచ్‌మార్క్‌ను నిర్దేశించగలవని ఆయన అన్నారు. గురువారం భారత అంతరిక్ష స్టార్టప్ 'స్కైరూట్'కు చెందిన ఇన్ఫినిటీ క్యాంపస్‌ను, సంస్థ తొలి ఆర్బిటల్ రాకెట్ 'విక్రమ్-%×%'ను వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఆవిష్కరించిన సందర్భంగా ప్రధాని ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ... "మన యువత, మన జెన్-జెడ్ ప్రతి రంగంలోని సవాళ్లకు పరిష్కారాలను అభివృద్ధి చేస్తున్నారు. వారి ఆత్మవిశ్వాసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న యువ ఆవిష్కర్తలకు స్ఫూర్తినిస్తుంది" అని తెలిపారు. భారత ప్రభుత్వం అంతరిక్ష రంగాన్ని ప్రైవేటుకు తెరిచినప్పుడు, మన యువత ఆ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుందని ఆయన గుర్తుచేశారు. దేశంలో ప్రైవేట్ అంతరిక్ష విప్లవానికి యువత ఉత్సాహమే కారణమని ప్రధాని పేర్కొన్నారు. ప్రస్తుతం 300కు పైగా స్పేస్ స్టార్టప్‌లు భారత అంతరిక్ష భవిష్యత్తుకు కొత్త ఆశలు కల్పిస్తున్నాయని చెప్పారు. ఈ స్టార్టప్‌లలో చాలా వరకు పరిమిత వనరులతో చిన్న బృందాలుగా ప్రారంభమైనప్పటికీ, ఉన్నత శిఖరాలకు చేరాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నాయని కొనియాడారు. గత దశాబ్ద కాలంలో దేశంలో స్టార్టప్ విప్లవం వచ్చిందని, భారత్ ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా అవతరించిందని మోదీ నొక్కిచెప్పారు. దేశంలో 1.5 లక్షలకు పైగా రిజిస్టర్డ్ స్టార్టప్‌లు ఉన్నాయని, ఇవి కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా చిన్న పట్టణాలు, గ్రామాల నుంచి కూడా పుట్టుకొస్తున్నాయని వివరించారు. ఫిన్‌టెక్, అగ్రిటెక్, హెల్త్‌టెక్ వంటి రంగాలతో పాటు ఇప్పుడు డీప్-టెక్, హార్డ్‌వేర్ ఆవిష్కరణల వైపు కూడా యువత అడుగులు వేస్తోందని ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు.

## ప్రశాంతంగా పంచాయితీ ఎన్నికల నిర్వహణ

**పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం**

**పోలీస్ అధికారులతో డిజిపి వీడియో కాన్ఫరెన్స్**

**హైదరాబాద్,నవంబర్27:** రాష్ట్రంలో జరగబోయే పంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని స్థాయిల పోలీస్ అధికారులు కృషి చేయాలని రాష్ట్ర డిజిపి బి. శివధర్ రెడ్డి ఆదేశం చారు. ఎన్నికల నిర్వహణపై రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. హైదరాబాద్ కమిషనరేట్ మినహా, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు మొదలుకొని స్టేషన్ హౌస్ ఆఫీసర్ల స్థాయి వరకు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్లు, జిల్లాల ఎస్పీలు గ్రామీణ ప్రాంతాల్లో జరిగే పంచాయతీ ఎన్నికలు సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా జరిగేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎన్నికలను నిస్పాక్షికంగా నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా నడుచుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని, ఆరోపణలకు ఆస్కారం ఇవ్వకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో శాంతి భద్రతల అదనపు డీజీపీ మహేష్ ఎం భగవత్, మల్టీ జోన్ 2 అడిషనల్ డీజీపీ డీఎస్ చౌహాన్, మల్టి జోన్- 1 ఐజీపీ ఎస్. చంద్రశేఖర్ రెడ్డి, ఏఐజీ రమణ కుమార్, లీగల్ అడ్వయిజర్ ఇ రాములు, తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్ సమావేశాలపై టిడిపి వ్యూహం

**పార్టీ ముఖ్యులతో సిఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతి,నవంబర్27:** పార్లమెంట్ శీతాకాల సమావేశాలు మరి కొద్ది రోజుల్లో ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ సమావేశమైంది. గురువారం రాజధాని అమరావతిలోని ఉండవల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో పార్టీ ఎంపీలు, ముఖ్యనేతలతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యారు. పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహం, కేంద్రం నుంచి రావాల్సిన ప్రయోజనాల సాధనకు తీసుకోవాల్సిన చర్యలపై ఈ సందర్భంగా చర్చించారు. మరోవైపు ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది. దీంతో ఏపీలో అభివృద్ధికి కేంద్రం తన వంతు సహాయ సహకారాలు అందిస్తుంది. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతాయి. ఇవి డిసెంబర్ 19వ తేదీతో ముగుస్తాయి. 2014లో ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ తొలిసారి బాధ్యతలు చేపట్టారు. ఆయన అధికారం చేపట్టిన తర్వాత జరుగుతున్న శీతాకాల సమావేశాల్లో ఇది అత్యంత తక్కువ కాలం. అంటే కేవలం 19 రోజులు మాత్రమే ఈ సమావేశాలు జరగనున్నాయి.

## గ్లోబల్ సమ్మిట్‌పై సిఎం రేవంత్ సమీక్ష

### పాలసీ డాక్యుమెంట్‌పై భేటీలో చర్చ



**హైదరాబాద్,నవంబర్27:** తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025పై రోజూ వరుస సమీక్షలు చేపట్టిన సీఎం రేవంత్ రెడ్డి గురువారం పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో రోజుకో అంశంపై చర్చిస్తున్నారు. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌పై ఈ భేటీలో చర్చించారు. పాలసీ డాక్యుమెంట్‌పై సీఎం రేవంత్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర అభివృద్ధిని ప్రతిబింబించేలా.. తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్ ఉండాలని సూచించారు. 2034 నాటికి ట్రిలియన్, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తెలంగాణను తీర్చిదిద్దేలా స్పష్టమైన రోడ్ మ్యాప్ పాలసీలో ఉండాలని స్పష్టం చేశారు. తెలంగాణ ఆర్థికాభివృద్ధిని మూడు రీజియన్లుగా విభజించి అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణ పాలసీ, భవిష్యత్ ప్రణాళికలు వివరించేలా పాలసీ డాక్యుమెంట్ ఉండాలని అధికారులకు సూచించారు. కాగా డిసెంబర్ 8,9 తేదీల్లో ఈ తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ జరగనున్న విషయం తెలిసిందే. ఈ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీని ఆహ్వానించనున్నట్లు సీఎం రేవంత్ ఇప్పటికే వెల్లడించారు. కేంద్ర మంత్రులతో పాటు సమ్మిట్‌కు ఆహ్వానించాల్సిన దేశ, విదేశాలకు చెందిన వ్యాపారవేత్తలు, ప్రముఖుల జాబితా ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులకు సీఎం

# జవాబుదారీతనం తప్పనిసరి

**బాధ్యతారాహిత్యంగా ఉండటం ఏంటి?**

**ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత ఉండాల్సిందే**

**సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**



**న్యూఢిల్లీ,నవంబర్ 27:** సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒకరు తప్పనిసరిగా బాధ్యత వహించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సొంతంగా ఛానల్ ప్రారంభించినంత మాత్రాన ఎవరికీ జవాబుదారీగా ఉండననుకోవడం సరికాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం అభిప్రాయపడింది. ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియాకు సంబంధించిన ఓ వివాదంపై గురువారం విచారణ సందర్భంగా ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. ఓ హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై అభ్యంతరకర ప్రశ్నలు అడిగిన ఘటనలో రణ్‌వీర్ వివాదాస్పదుడయ్యారు. ఈ కేసు విచారణకు రాగా, ధర్మాసనం పలు కీలక ప్రశ్నలు సంధించింది. "అసభ్యకరమైన కంటెంట్ అప్‌లోడ్ చేస్తే అది వైరల్ అవుతుంది, లక్షల మంది చూస్తారు. దీన్ని ఎలా నియంత్రిస్తారు? దేశ వ్యతిరేక కంటెంట్ పెట్టినప్పుడు దానికి సదరు క్రియేటర్ బాధ్యత వహిస్తారా?" అని కేంద్రాన్ని ప్రశ్నించింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, ఇది కేవలం అశ్లీలతకు సంబంధించిన అంశం కాదని, యూజర్లు సృష్టించే కంటెంట్‌లోని లోపాలను ఇది ఎత్తిచూపుతోందని అన్నారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను వక్రీకరించకూడదని ఆయన పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం, ఆన్‌లైన్ కంటెంట్‌ను పర్యవేక్షించే వ్యవస్థ ఉన్నప్పటికీ ఇలాంటివి ఎందుకు జరుగుతున్నాయని కేంద్రాన్ని నిలదీసింది. సోషల్ మీడియాలో వినియోగదారులు సృష్టించే కంటెంట్‌ను నియంత్రించేందుకు సరైన నిబంధనలు రూపొందించాలని ఆదేశించింది. ఇందుకు కేంద్రానికి నాలుగు వారాల సమయం ఇచ్చింది.

# మళ్లీ గెలుస్తాం...

## కెసిఆర్‌ను సిఎంను చేస్తాం

**రాజకీయాల్లో గెలుపోటములు సహజం**

**- అసలు యుద్ధం 2028లో ఉంటుంది - తెలంగాణ భవన్‌లో వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్**




**హైదరాబాద్,నవంబర్ 27:** రాజకీ యాల్లో గెలుపోటములు సహజమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మళ్లీ గెలుస్తాం.. అధికారంలోకి వస్తామని కెటిఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఏపిలో కల్వకుర్తిలో ఎన్టీఆర్ కూడా ఓడిపోయారని ఆయన గుర్తుచేశారు. అసలు యుద్ధం 2028లో ఉంటుందని తెలిపారు. కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజల సమక్షం లో బయట పెడుదామని పిలుపు నిచ్చారు. కల్వకుర్తి నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు జరిగాయి. తెలంగాణ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ సమక్షంలో ఈ చేరికలు జరిగాయి. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. బానిసత్వం లేని ఒకే ఒక్క పార్టీ గులాబీ పార్టీ అని తెలిపారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 8 లక్షల ఎకరాలకు కేసీఆర్ సాగునీరు ఇచ్చారని కేటీఆర్ తెలిపారు. లక్ష్మీదేవిపల్లి 660 మీటర్ల ఎత్తు ఉంటుందని పేర్కొన్నారు. కాళేశ్వరం, పాలమూ రు - రంగారెడ్డి ప్రాజెక్టులను కేసీఆర్ చేపట్టారని అన్నారు. గొలుసుకట్టు రిజర్వా యర్లను 90 శాతం పనులు పూర్తి చేశారని తెలిపారు. ఒక పంపును కూడా కేసీఆర్ ప్రారంభిం చారని చెప్పారు. పాలమూరు ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం తప్ప రేవంత్ రెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. కరెంట్ కష్టాలతో ఎంతమంది చనిపోయారో మీకంతా తెలుసని కేటీఆర్ గుర్తుచేశారు. వైఎస్ హయాంలో ఉచిత కరెంట్ ఇచ్చినా.. ఆరు గంటలే ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ హయాంలో దొంగలు కొట్టే సమయంలో కరెంటు ఇచ్చేవారని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో కరెంటు రాలేదని రేవంత్ రెడ్డే చెప్పాడని అన్నారు.

## ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంతో ఉన్నారు

**రావల్పిండి జైలు అధికారుల వెల్లడి**

**రావల్పిండి,నవంబర్ 27:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, పీటీఐ పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ జైల్లో మరణించారంటూ సోషల్ మీడియాలో వ్యాపించిన వదంతులపై రావల్పిండిలోని అడియాలా జైలు అధికారులు స్పందించారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని గురువారం స్పష్టం చేశారు. ఆయన్ను జైలు నుంచి ఎక్కడికీ తరలించలేదని, ప్రస్తుతం తమ వద్దే ఉన్నారని తెలిపారు. జైలు అధికారులు విడుదల చేసిన ప్రకటనలో, "ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలు నుంచి తరలించారనే కథనాల్లో వాస్తవం లేదు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు, అవసరమైన పూర్తి వైద్య సంరక్షణ అందిస్తున్నాం" అని పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యంపై వస్తున్న పుకార్లను నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఈ వదంతులపై ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్-ఎ-ఇన్సాఫ్ (పీటీఐ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని, ఇమ్రాన్‌తో ఆయన కుటుంబ సభ్యుల భేటీని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. గత కొన్ని వారాలుగా ఇమ్రాన్ సోదరీమణులను ఆయన్ను కలిసేందుకు అనుమతించకపోవడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. తమ సోదరుడిని కలిసేందుకు అనుమతించకపోవడంతో



ఇమ్రాన్ సోదరీమణులు అలీమా ఖాన్, నూరీన్ ఖాన్, ఉజ్మా ఖాన్ మంగళవారం అడియాలా జైలు బయట గంటల తరబడి నిరసన చేపట్టారు. "లోపల ఏం జరుగుతోందో ఎవరికి తెలుసు? బహుశా ఇమ్రాన్‌ను వేరే చోటుకు తరలించి ఉండవచ్చు. అందుకే మమ్మల్ని కలవనివ్వడం లేదు" అని అలీమా ఖాన్ అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో అరాచక పాలన నడుస్తోందని ఆమె విమర్శించారు. 2022లో అవిశ్వాస తీర్మానంతో అధికారం కోల్పోయిన ఇమ్రాన్ ఖాన్, అవినీతి, ఉగ్రవాదం వంటి పలు కేసుల్లో 2023 ఆగస్టు నుంచి జైలు శిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే.

# రాష్ట్రంలో రాక్షస పాలన కొనసాగుతుంది

**హైదరాబాద్,నవంబర్ 27 :** రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి రాక్షస పాలన కొనసాగుతుందని, రాజ్యాంగాన్ని అవహేళన చేస్తూ చట్టంలోని నిబంధనలను బేఖాతరు చేసి కాంగ్రెస్ నేతలు దుశ్చర్యలకు పాల్పడుతున్నారని బీఆర్ఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్రంలో కొనసాగేది ప్రజా పాలన కాదని.. ప్రజా ప్రతీకార పాలన.. పోలీసు రాజ్యమని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి అనుచరులు మంత్రి సురేఖ ఓఎస్డీ సుమంత్ తో కలిసి దక్కన్ సిమెంట్ యజమానులను గన్నుతో బెదిరిస్తే వారిని కాపాడేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సీపీకి లేఖ రాయగా రాత్రికి రాత్రే మంత్రి ఉత్తమ్, సీఎం రేవంత్‌లు టాస్క్‌ఫోర్స్ పోలీసులను మంత్రి సురేఖ ఇంటికి పంపించిన విషయం వాస్తవం కాదా ఆయన ప్రశ్నించారు. అయినప్పటికీ సుమంత్ ని అరెస్ట్ చేయలేదన్నారు. అలాంటప్పుడు చేయని నేరానికి అకారణంగా ఐదు రోజులు కర్ల రాజేశ్ పోలీసుల రిమాండ్‌లో ఉంటే ఈ నియోజకవర్గానికి బాధ్యత వహించే మంత్రి ఉత్తమ్ ఎందుకు లేఖ రాయలేదని ఆయన విమర్శించారు. డిసి బసు కేసును అనుసరించి కేసు తీర్పు ప్రకారం రాజేశ్ తల్లిని తన కుమారుడితో ఎందుకు కలవనీయలేదని ఐదు రోజుల పాటు నిందితుడిని పోలీస్ స్టేషన్‌లో ఉంచకూడదని వారికి తెలియదా అన్నారు. ఆర్టికల్ 21 ప్రకారం రాజేశ్‌ని ఎందుకు కాపాడలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో పేదల జీవితాలు లాకప్‌లోనే తెల్లారుతున్నాయన్నారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మల్లయ్య యాదవ్ పేరు చెప్పాలని రాజేశ్‌ను పోలీసులు చిత్రహింసలు పెట్టారని అందువల్లే ఆయన మృతి చెందారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎత్తిపోతల పథకానికి రూ.5 కోట్ల ప్రాజెక్టును రాత్రికి రాత్రే రూ.50 కోట్లకు పెంచడం అవినీతి కాక మరేమిటన్నారు. ఏమాత్రం ప్రణాళిక లేకుండా కొడంగల్ నారాయణపేట ప్రాజెక్ట్‌కు రూ.4 వేల కోట్లు కేటాయించారని ఈ అంశంలో సీఎం రేవంత్ రెడ్డిని ఎందుకు అరెస్ట్ చేయలేదన్నారు. ఎస్ఎల్‌బీసీ దుర్ఘటనలో 8 మంది సజీవ సమాధి అయ్యారని, ఇందుకు మంత్రి ఉత్తమ్‌పై కేసు పెట్టలేదన్నారు. రాజేశ్‌కు నేర చరిత్ర లేదని అతనొక్కడే కుటుంబానికి ఆధారమని, త్వరలో ఇల్లు నిర్మాణం చేయిస్తానని తెలిపారు. న కుమారుడి ఆరోగ్యం బాగాలేదని రాజేశ్ తల్లి ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్తానని పోలీసుల ఎదుట నెత్తి నోరు బాదుకున్నప్పటికీ పోలీసులు వినలేదని, నాణ్యమైన వైద్యం అందించకుండా చంపారని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఆయనను అప్రూవర్‌గా తీసుకుని కేసును విచారించాల్సింది పోయి ఏకంగా చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని జీవించే హక్కును కాపాడుతానని చెబుతుంటే సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు ప్రతిరోజు ప్రజా పాలన ఇందిరమ్మ పాలన అంటూ పేదలను చంపుతున్నారని, జీవించే హక్కును కాలరాస్తున్నారని మండిపడ్డారు. చేవెళ్ల సాక్షిగా దళితులను బాగా చూసుకుంటామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేతో వాగ్దానం చేయించి ఈరోజు ప్రాణాలు తీస్తున్నారన్నారు. ,292 ఎకరాల భూమిని ఆగమేఘాల మీద పాలసీ పేరుతో రూ.5 లక్షల కోట్ల కుంభకోణం చేసి ఆ భూమిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంబంధికులకు కట్టబెట్టారన్నారు. కావాలనే రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీకి చెందిన పేద వర్గాల అధికారులను ఏసీబీ అధికారులు అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేస్తున్నారని అందులో భాగమే సూర్యాపేట ప్రాంతానికి చెందిన అంబేద్కర్ అని అధికారి అరెస్ట్ అని పేర్కొన్నారు. బడుగు వర్గాల అధికారులపై ఏసీబీ అధికారులు అక్రమ కేసులు బనాయిస్తుంటే ఆ సామాజిక వర్గాలకు చెందిన మంత్రులు అడ్లూరి భట్టి, వివేక్, రాజనర్సింహ ఏం చేస్తున్నారని దుయ్యబట్టారు. చిలుకూరు ఎస్ఐపై హత్యా నేరం కేసు నమోదు చేయాలని, రాజేశ్ మృతదేహానికి రీపోస్ట్‌మార్టం నిర్వహించాలన్నారు. గ్రేహౌండ్స్ తరహాలో ఎస్సీ సబ్ ఎ÷-లాన్ నిధులతో ప్రత్యేక రక్షణ దళం ఏర్పాటు చేయాలని, ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా ఎస్సీ, ఎస్టీల కోసం పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, బాధితులకు లైసెన్స్ వెపన్స్ ఇచ్చి శిక్షణ ఇవ్వాలన్నారు. నిజాయితీ చూపిన ఎస్సీ, ఎస్టీ అధికారులకు ఆక్సిలరీ ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. ÷ూజేశ్ కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీంతో పాటు రాజేశ్ కుటుంబానికి 5 ఎకరాల భూమి, డబుల్ బెడ్ రూమ్ ఇల్లు, తల్లికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. రాజేశ్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు అన్ని కుల సంఘాలు, ప్రజా సంఘాలు బావ సారూప్యం కలిగిన సంఘాలతో కలిసి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందన్నారు

# హైడ్రా పనితీరుకు ప్రజల ప్రశంసలు

**- కూకట్పల్లి నల్లచెరువు అభివృద్ధిపై వాకర్స్ ర్యాలీ**

**- ఓపెన్ జిమ్, షటిల్ కోర్టుల ఏర్పాటుకు డిమాండ్ - పునరుద్ధరణతో ఆరోగ్యవంతమైన వాతావరణం**





**కూకట్పల్లి, 27 నవంబర్** కూకట్పల్లి నల్లచెరువు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని స్థానిక వాకర్స్ స్పష్టం చేశారు. గురువారం ఉదయం చెరువు చుట్టూ ప్రత్యేక ర్యాలీ నిర్వహిస్తూ, హైడ్రా చేసిన అభివృద్ధి పనులను ప్రజలు విస్తృతంగా ప్రశంసించారు. ఒకప్పుడు దుర్గంధం, చెత్త, దోమలతో నరకంలా ఉన్న ఈ ప్రాంతం ఇప్పుడు ప్రజలు సేద తీరే, ఆరోగ్యాన్ని పెంపొందించుకునే అద్భుతంగా మారిందని పాల్గొన్న వారు వెల్లడించారు. చెరువు పునరుద్ధరణలో భాగంగా నిర్మించిన పటిష్ట బండ్, విస్తృతమైన వాకింగ్ ట్రాక్ స్థానికులకు పెద్ద వరమైందని ర్యాలీలో పాల్గొన్న మహిళలు, వయోజనులు అభిప్రాయ పడ్డారు. “మునుపు ఉదయం ఇక్కడికి రావడమనేది అసాధ్యం ఇప్పుడైతే ప్రతిరోజూ ఆహ్లాదకరమైన గాలి, నిశ్శబ్ద వాతావరణం ఆరోగ్యాన్ని పెంచుతోంది,” అని వాకర్స్ పేర్కొన్నారు. అభివృద్ధి పనులపై సంతోషం వ్యక్తం చేసిన వాకర్స్, ఇంకా కొన్ని సౌకర్యాలు కావాలని ప్రభుత్వానికి కోరారు. ముఖ్యంగా ఓపెన్ జిమ్‌లు, షటిల్ కోర్టులు, బహిరంగ వ్యాయామ స్థలాలు ఏర్పాటు చేస్తే చెరువు ఇంకా ప్రజల జీవనశైలిలో ముఖ్య భాగమవుతుందన్నారు. పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియా, కూర్చుని విశ్రాంతి తీసుకునే స్పాట్లు ఏర్పాటు చేస్తే కుటుంబాలందరికీ ఇది పూర్తి స్థాయి రిక్రియేషన్ జోన్‌గా మారుతుందని అభిలషించారు. చెరువు అభివృద్ధి నిదర్శనంగా నిలిచిన ఈ ప్రాజెక్టును రాష్ట్ర ప్రభుత్వం, హైడ్రా ప్రాముఖ్యతతో తీసుకుని ముందుకు నడిపినందుకు ప్రజలు ర్యాలీలో ముందుకు వచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, ప్రభుత్వ పట్టుదల కలిసొస్తే నగరంలోని ప్రతి చెరువు ఇలాగే మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ విద్యార్థి విభాగం పాటను ఆవిష్కరించిన కేటీఆర్

**- నందినగర్‌లో ప్రత్యేక కార్యక్రమం**

**- విద్యార్థి విభాగం ఉత్సాహాన్ని పెంచే లక్ష్యంతో పాట - అనేక నేతలు, కార్యకర్తలు పాల్గొన్న వేడుక**



**హైదరాబాద్, 27 నవంబర్** బీఆర్ఎస్ పార్టీ విద్యార్థి విభాగం కోసం రూపొందించిన కొత్త పాటను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం హైదరాబాద్ నందినగర్‌లోని తన నివాసంలో ఆవిష్కరించారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగారం ప్రశాంత్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ పాట యువతలో ఉత్తేజాన్ని పెంచేందుకు, విద్యార్థి విభాగం కార్యకలాపాలను మరింత ప్రభావవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా రూపొందించబడింది. విద్యార్థుల రాజకీయ చైతన్యాన్ని, సంఘటిత శక్తిని ప్రతిబింబించేలా ఈ పాట రూపొందినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డా. గాదరి కిషోర్ కుమార్, ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ సతీష్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీష్, రాష్ట్ర నాయకులు వల్లమల్ల కృష్ణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బూరుగు నవీన్ గౌడ్, మిథున్ ప్రసాద్ తదితరులు హాజరయ్యారు. సింగర్స్ మద్దెల సందీప్ గౌడ్, మానుకోట ప్రసాద్ సంగీతం అందించి కార్యక్రమానికి ప్రత్యేకతని చేర్చారు. కేటీఆర్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం గతంలో చూపిన కృషి, ఉద్యమాల్లో వారి పాత్ర రాష్ట్ర రాజకీయాల్లో కీలకమని పేర్కొన్నారు. ఈ పాట యువతలో మరింత ఉత్సాహం నింపి భవిష్యత్ నాయకత్వాన్ని నిర్మించే దిశగా ఉపయుక్తమవుతుందని అన్నారు. విద్యార్థులు సామాజిక మార్పుల కోసం ముందుకు వస్తేనే రాష్ట్ర అభివృద్ధికి బలం చేకూరుతుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. పార్టీ సిద్ధాంతాలు, విద్యార్థి శక్తి కలిసినప్పుడు పెద్ద ఉద్యమాలకు దారితీసే శక్తి ఏర్పడుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంతో బీఆర్ఎస్ విద్యార్థి విభాగం రాష్ట్రవ్యాప్తంగా కొత్త ఉత్సాహాన్ని సంతరించుకుంది. ప్రత్యేక కార్యక్రమాలు, పాటలు, ప్రచార సామగ్రి ద్వారా విద్యార్థుల సభ్యత్వాన్ని విస్తరించేందుకు పార్టీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. రానున్న విద్యార్థి ఎన్నికల్లో ఈ పాట ప్రాముఖ్యత సంతరించుకుంటుందని, యువతను ఆకట్టుకునే విధంగా దీన్ని వినూత్నంగా రూపొందించామని నిర్వాహకులు చెప్పారు.

# స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి



**నిజామాబాద్,నవంబర్27:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి పిలుపునిచ్చారు. అలాగే 29న నిర్వహించే దీక్షా దివస్’ ను విజయవంతం చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అధికార పార్టీ తంటాలు పడుతోందని, బీసీ రిజర్వేషన్లు ఇవ్వడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. 42 శాతం ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ చివరికి పంచాయతీ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా లేకుండా చేసిందని ధ్వజమెత్తారు. ఇది ముమ్మాటికీ బీసీలకు ద్రోహం చేయడమేనని దుయ్యబట్టారు. ఆరు గ్యారెంటీలను అమలుచేయలేక, ఎన్నికలకు వెళ్లే ధైర్యంలేక న్యాయస్థానం చెప్పేవరకు చేసుకుందని విమర్శించారు. అందుకే పార్టీ గుర్తులు లేని పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తోందని, ఎవరు గెలిచినా తమవాళ్లే అని చెప్పుకోవడం కోసం ఈ తతంగం చేస్తోందని ధ్వజమెత్తారు. ఉమ్మడి జిల్లాలో గులాబీ పార్టీకి మంచి పట్టుందని, స్థానిక ఎన్నికలతో పాటు మళ్లీ అసెంబ్లీ ఎన్నికలొచ్చినా గులాబీ జెండా ఎగరడం ఖాయమని తేల్చిచెప్పారు. 29న జరిగే దీక్షా దివస్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రెండేళ్లలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేసిన మోసపు హామీలను అలాగే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గత పదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక ఎన్నికల్లో ఓట్లను అభ్యర్థించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలుకు సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి హామీ లు అమలు చేయక పోవడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహంగా ఉన్నారన్నారు. రైతుల ధాన్యం కొనుగోలు చేయకుండా లారీకి 1.5 క్వింటాలు కోతలు పెట్టి వేధిస్తున్నారన్నారు. కేసీఆర్ 18 ఏండ్లు నిండిన ప్రతి మహిళకు బతుకమ్మ చీరెలను పంపిణీ చేశారని, రేపంత్ ప్రభుత్వం మాత్రం సంఘబంద సభ్యులకే చీరెలు పంపిణీ చేస్తుండడంతో హహిళలు గ్రామాల్లో నిలదీయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ఎన్నికలకు కాలయాపన చేయడంతో గ్రామాలు నిర్వీర్యం అయ్యాయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల సర్వేలో బీఆర్ఎస్ పార్టీకే ప్రజలు మొగ్గు చూపుతున్నట్లు తేలిందన్నారు. పార్టీ శ్రేణులంతా ఐక్యమత్యంగా పనిచేసి బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించు కోవాలని పేర్కొన్నారు.

# తెలంగాణ మౌలిక వసతులకు కొత్త దిశ

**విజన్ 2047పై ఆర్‌అండ్‌బి శాఖ విస్తృత సమీక్ష**

**3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యంతో సమగ్ర ప్రణాళికలు**

**ట్రాఫిక్ అవసరాలపై 5-15 ఏళ్ల దిశానిర్దేశం**

**అభివృద్ధి దిశను మార్చే రోడ్, ఎక్స్‌ప్రెస్‌వే, ఎలివేటెడ్ ప్రాజెక్టులు**



**హైదరాబాద్, 27 నవంబర్** తెలంగాణ అభివృద్ధి యాత్రలో మౌలిక వసతుల విస్తరణ కేంద్రీయ పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో, హైదరాబాద్ ఎర్రమంజిల్‌లోని ఆర్ అండ్ బి ప్రధాన కార్యాలయంలో ‘విజన్ 2047’ పై రాష్ట్ర రహదారుల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కీలక సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి వాకిటి శ్రీహరి, ఆర్డీసీ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్‌తో పాటు ఉన్నతాధికారులు హాజరయ్యారు. 2047 నాటికి తెలంగాణను %వి%3 ట్రిలియన్ ఎకానమీగా తీర్చిదిద్దాలన్న లక్ష్యం లో ఆర్ అండ్ బి శాఖ పాత్ర అత్య ంత ప్రధానమని మంత్రి స్పష్టం చేశారు. వచ్చే 5, 10, 15 ఏళ్లలో రాష్ట్రంలో పెరిగే జనాభా, వాహన రద్దీ, పరిశ్రమల విస్తరణను దృష్టిలో ఉంచుకుని ప్రతి రహదారికి ముందస్తు అంచనాలు, సమగ్ర మార్గదర్శ కాలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. భవిష్యత్ అవసరా లను ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు సిద్ధం చేస్తేనే రాష్ట్ర అభివృద్ధి వేగం నిలకడగా కొనసాగుతుందని మంత్రి చెప్పారు. నగరాలు, పట్టణాలు, గ్రామీణాల మధ్య కనెక్టివిటీ పెంపు, రవాణా సౌకర్యాల మెరుగుదలలో ఆర్ అండ్ బి శాఖ కీలక దిశనిర్దేశక పాత్ర పోషించనుందని ఆయన అభిప్రాయపడ్డారు. గత రెండేళ్లలో ఆర్ అండ్ బి శాఖలో కోటి చదరపు అడుగులకు పైగా నిర్మాణాలు పూర్తి చేసినట్టు మంత్రి వివరించారు. హ్యామ్ రోడ్లు, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్లు, ఎక్స్‌ప్రెస్‌వేలు, కొత్త ఎయిర్ పోర్టులు, ఎలివేటెడ్ కారిడార్లు వంటి ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధి దిశను పూర్తిగా మార్చే సామర్థ్యం కలిగి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా రీజినల్ రింగ్ రోడ్, హైదరాబాద్ పరిధిలో రేడియల్ కనెక్టివిటీ, జిల్లా ప్రధాన రహదారుల విస్తరణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు బలాన్నిస్తాయని తెలిపారు. డిసెంబర్ 8, 9 తేదీల్లో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ కోసం ప్రత్యేక విజన్ డాక్యుమెంట్ సిద్ధం చేయనున్నట్లు మంత్రి వెంకట్ రెడ్డి వెల్లడించారు. ఇప్పటివరకు పూర్తి చేసిన మౌలిక వసతుల పనులు, చేపట్టబోయే భారీ ప్రాజెక్టులుమన్న నూర్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్, భారత్ ఫ్యూచర్ సిటీ-బందరు పోర్టు గ్రీన్‌ఫీల్డ్ హైవే, హైదరాబాద్-విజయవాడ ఎక్స్‌ప్రెస్‌మే తదితరాలను అంతర్జా తీయ వేదికపై రాష్ట్రం ప్రదర్శిం చేందుకు ప్రభుత్వం సిద్ధమవు తోంది. ఈ విజన్ ద్వారా తెలం గాణ గ్లోబల్ పెట్టుబడుల గమ్యస్థా నంగా మరింత నిలుస్తుందని చేశారు.

# తిరుమల కల్తీ నెయ్యి కేసులో కీలక పరిణామం

- టీటీడీ జీఎం సుబ్రహ్మణ్యం అరెస్ట్ • కొనుగోలు విభాగంలో అవకతవకలపై సిట్ దృష్టి
- సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐ దర్యాప్తు వేగం • ఈ కేసులో పదో అరెస్టుతో విచారణ కొత్త దిశలోకి



**తిరుపతి, 27 నవంబర్**
తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ పర్యవేక్షణలో దర్యాప్తు చేస్తున్న ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్), టీటీడీ కొనుగోలు విభాగం జనరల్ మేనేజర్ కె. సుబ్రహ్మణ్యంను గురువారం అరెస్ట్ చేసింది. ఇంతకు ముందు ఈ కేసులో కాంట్రాక్టర్లు, వ్యాపారులు అరెస్టైనప్పటికీ, టీటీడీ ఉన్నతాధికారిని అదుపులోకి తీసుకోవడం ఇదే తొలి ఘటన. ఈ అరెస్టుతో కేసులో నిందితుల సంఖ్య 10కి చేరింది. సిట్ విచారణలో, నెయ్యి సరఫరా కాంట్రాక్ట్‌లలో అవకతవకలు చోటుచేసుకున్నట్లు స్పష్టమైంది. సుబ్రహ్మణ్యం కొనుగోలు ప్రక్రియలో నిబంధనలను ఉల్లంఘించడం, నాణ్యత లేని నెయ్యి సరఫరాకు సహకరించడం వంటి కీలక ఆరోపణలు విచారణలో తేలినట్లు తెలుస్తోంది. గతంలో అరెస్టయిన కాంట్రాక్టర్ల వాంగ్మూలాల్లో బయటపడ్డ వివరాలు సుబ్రహ్మణ్యం పాత్రను బలపరిచాయని అధికారులు పేర్కొన్నారు. లడ్డూలో ఉపయోగించే నెయ్యి నాణ్యతపై వచ్చిన భారీ విమర్శల తరువాత ఈ కేసు రాష్ట్రమంతా చర్చనీయాంశంగా మారింది. అరెస్టు అనంతరం సుబ్రహ్మణ్యంను తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. తదుపరి చట్టప్రక్రియల్లో భాగంగా ఆయనను నెల్లూరు ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నారు. కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించే అవకాశం ఉందని సిట్ వర్గాలు భావిస్తున్నాయి. టీటీడీ అంతర్గత వ్యవస్థలోకి దర్యాప్తు మొదటిసారిగా విస్తరించడం ఈ కేసు మరింత లోతుకు చేరుతోందని అధికారులు పేర్కొన్నారు. భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసంతో ముడిపడి ఉన్న తిరుమల లడ్డూ ప్రసాదం నాణ్యతపై ప్రశ్నలు లేవడంతో మొదలైన ఈ దర్యాప్తు ఏపీ హైకోర్టు ఆదేశాల తర్వాత వేగం పుంజుకుంది. తరువాత సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ సాగుతుండటం కేసుకు జాతీయ ప్రాధాన్యతను తెచ్చింది. నెయ్యి సరఫరా వ్యవస్థలో మరిన్ని అవకతవకలు వెలుగులోకి రావచ్చని విచారణాధికారులు సూచిస్తున్నారు.

# ఆధార్ ఉన్నంత మాత్రాన ఓటు హక్కు ఇవ్వాలా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**చొరబాటుదారుల ఆధార్ కార్డులపై న్యాయస్థానం ఆందోళన**

**రాష్ట్రాలపై ఎన్నికల కమిషన్‌కు నోటీసులు**

**పౌరసత్వ రుజువు కాదని ఆధార్ చట్టంపై బెంచ్ స్పష్టం**




**న్యూఢిల్లీ, 27 నవంబర్**
చొరబాటుదారులు ఆధార్ కార్డు పొందటం, దాని ఆధారంగా ఓటరు హక్కు పొందే పరిస్థితిపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. "ఆధార్ ఉండటం వల్లే ఎవరినైనా ఈ దేశపు పౌరుడిగా గుర్తించాలా? పౌరసత్వ ప్రమాణానికి ఆధార్ ప్రమాణం ఎలా అవుతుంది?" అని బెంచ్ ప్రశ్నించింది. సంక్షేమ పథకాల సరఫరా కోసం మాత్రమే అధార్ ఉపయోగపడుతుందని, పౌరసత్వానికి ఇది ఎటువంటి నిర్ధారణ పత్రం కాదని స్పష్టంగా వెల్లడించింది. ఇందులో భాగంగా ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ప్రస్తుతం కీలక పిటిషన్లను విచారిస్తోంది. ఎన్నికల కమిషన్ పలు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టాలనే నిర్ణయాన్ని సవాలు చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ప్రత్యేకించి తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఈ రివిజన్ పనితీరుపై అభ్యంతరాలు వ్యక్తమవు తున్నాయి. ఇలాంటి పరిస్థితు ల్లో ఓటరు జాబితాలో పేర్లను నమోదు చేయడంలో ఆధార్‌ను ప్రధాన ఆధారంగా పరిగణించడం ఎంతవరకు సరైనదో ప్రశ్నిస్తూ సుప్రీంకోర్టు ఎన్నికల కమిషన్‌ను వివరణ కోరింది. "అధార్ చట్టం పౌరసత్వం ఇవ్వదు, నివాస ప్రామాణికతను కూడా నిర్ధారించదు" అని బెంచ్ స్పష్టం చేసింది. ఓటు హక్కును తొలగించే ముందు నోటీసు ఇవ్వాలని కోర్టు స్పష్టమైన సూచనలు చేసింది. ఓటరు జాబితాలో పేరు నమోదు లేదా తొలగింపులో ప్రతీ నిర్ణయం, దరఖాస్తు దారు సమర్పించిన దస్తావేజుల ఆధారంగా ఎన్నికల కమిషన్ తీసుకోవాల్సిందేనని పేర్కొంది. "ఎలక్షన్ కమిషన్ పోస్టాఫీసు కాదు దరఖాస్తు వచ్చినంత మాత్రాన ఒప్పుకుని పంపేది కాదు" అని బెంచ్ ఘాటుగా వ్యాఖ్యానించింది. ఓటరు పరిష్కారాల్లో సరైన ధృవీకరణ ప్రక్రియ తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఈ వివాదంపై మరింత లోతైన విచారణ జరపడానికి సుప్రీంకోర్టు ప్రత్యేక షెడ్యూల్‌ను సిద్ధం చేసింది. డిసెంబర్ 1లోపు ఎన్నికల కమిషన్ ప్రతిస్పందనలు దాఖలు చేయాలని ఆదేశించింది. పిటిషనర్లు తమ అభ్యంతరాలను, ఆధార్-ఓటరు నమోదు వ్యవస్థలో ఉన్న లోపాలను పూర్తి వివరాలతో సమర్పించవచ్చని తెలిపింది. అంశాలపై త్వరలోనే మరింత విస్తృత వాదనలు వినిపించనున్నట్లు బెంచ్ వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఓటు హక్కు ధృవీకరణ ప్రోటోకాల్‌లో మార్పులకు దారితీసే అవకాశం ఉన్న ఈ విచారణపై దృష్టి నిలిచింది.

# ఆన్‌లైన్ కంటెంట్‌పై జవాబుదారీతనం తప్పనిసరి: సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

**- యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా వివాదంపై విచారణ**

**- అశ్లీలత, అసభ్య కంటెంట్ నియంత్రణపై కేంద్రానికి ప్రశ్నలు - కంటెంట్ నియంత్రణ నిబంధనలకు నాలుగు వారాల గడువు**



**న్యూఢిల్లీ, 27 నవంబర్**
ఆన్‌లైన్ కంటెంట్ పర్యవేక్షణ, బాధ్యత విధానం, అసభ్యకర వ్యాఖ్యలు వంటి అంశాలపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. "సొంతంగా ఛానల్ ప్రారంభించుకున్నంత మాత్రాన ఎవరికీ బాధ్యత ఉండదని అనుకోవడం సరికాదుబీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే కంటెంట్‌కు ఎవరో ఒక్కరు తప్పనిసరిగా జవాబుదారి కావాలి" అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇటీవలి కాలంలో ఆన్‌లైన్‌లో పెరుగుతున్న అసభ్యకర, వివాదాస్పద కంటెంట్ నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా పాల్గొన్న హాస్య కార్యక్రమంలో, పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంపై అభ్యంతరకర ప్రశ్నలు అడిగిన ఘటన పెద్ద వివాదంగా మారిన విషయం తెలిసిందే. ఈ కేసు విచారణ సందర్భంగా ధర్మాసనం కేంద్ర ప్రభుత్వం, సోషల్ మీడియా ప్లాట్‌ఫార్మ్‌లు, కంటెంట్ క్రియేటర్ల బాధ్యతలపై పలు కీలక ప్రశ్నలు సంధించింది. "అసభ్యకర కంటెంట్ అప్‌లోడ్ అవుతూనే ఉంది, అవి వైరల్ అవుతున్నాయి. ఇలాంటి కంటెంట్‌ను ఎవరు పర్యవేక్షిస్తున్నారు?" అని కోర్టు ప్రశ్నించింది. కేంద్రం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా మాట్లాడుతూ, ఇది కేవలం అశ్లీలత సమస్య కాదు, యూజర్ జనరేటెడ్ కంటెంట్‌లోని లోపాలను వెలికితీసే పెద్ద వ్యవస్థాపక సమస్య అని పేర్కొన్నారు. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను కూడా దుర్వినియోగం చేయకూడదని, ప్లాట్‌ఫార్మ్‌లకు, క్రియేటర్లకు తగిన బాధ్యత ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో నియంత్రణను అమలు చేయడంలో ఉన్న చట్టపరమైన పరిమితులు, అమలులోని లోపాలను కూడా ఆయన ప్రస్తావించారు. వాదనలు విన్న ధర్మాసనం, ఆన్‌లైన్ కంటెంట్ పర్యవేక్షణ వ్యవస్థ ఉన్నప్పటికీ ఇలాంటి వివాదాస్పద ఘటనలు ఎందుకు జరుగుతున్నాయని కేంద్రాన్ని నిలదీసింది. సోషల్ మీడియా వినియోగదారులు సృష్టించే కంటెంట్‌పై క్లియర్ మార్గదర్శకాలు రూపొందించాలని కేంద్రానికి ఆదేశించింది. ఇందుకు ప్రత్యేకంగా నాలుగు వారాల గడువు ఇచ్చింది. భవిష్యత్తులో ఆన్‌లైన్ కంటెంట్‌పై బాధ్యత, నియంత్రణ, పర్యవేక్షణపై మరింత సమగ్ర చట్టపరమైన మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉందని న్యాయవర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# శ్రీ సత్యసాయి జిల్లాలో దారుణం

**నాలుగేళ్ల బాలుడిని హత్య చేసిన మేనత్త భర్త**

**కుటుంబ వివాదం కక్షగా మారి అమాయకుడి ప్రాణం బలి**

**అపహరణ-హత్యలో నిందితుడిగా ప్రసాద్‌పై కేసు బలపరుస్తున్న పోలీసులు**

**బాలుడి మృతదేహం గ్రామ సమీపంలో కనుగొనడంతో విషాదం**



**శ్రీ సత్యసాయి జిల్లా, 27 నవంబర్**
శ్రీ సత్యసాయి జిల్లాలో బంధుత్వానికే మచ్చ తెచ్చే దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. నాలుగేళ్ల అమాయక బాలుడిపై చూపిన క్రూరత్వం గ్రామాన్ని విషాదంలో ముంచేసింది. వైద్యానికి డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో తన స్వంత మేనల్లుడినే కిడ్నాప్ చేసి హత్య చేశాడనే ఆరోపణలతో మేనత్త భర్త ప్రసాద్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎన్.పి. కుంట మండలం గౌకనపేట గ్రామంలో జరిగిన ఈ ఘటన ప్రాంత ప్రజల్లో తీవ్ర కలకలం రేపింది. స్థానికుల సమాచారం, తల్లిదండ్రుల ఫిర్యాదు ఆధారంగా పోలీసులు వివరాలు సేకరించారు. గౌకనపేటకు చెందిన గంగాధర్ కుమారుడు హర్షవర్ధన్ (4) బుధవారం ఉదయం ఇంటి వద్ద కనిపించకుండా పోయాడు. దొరకకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతూ సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు పలు బృందాలను రంగంలోకి దించి శోధనా చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం గ్రామ సమీపంలో బాలుడి మృతదేహం లభించడంతో కేసు హత్యవైపుకు మలిచింది. డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపిన వివరాల ప్రకారం, బాలుడి హత్యలో నిందితుడు ప్రసాద్‌కే సంబంధం ఉన్నట్లు విచారణలో తేలింది. ప్రసాద్ కుమారుడు క్యాన్సర్‌తో బాధపడుతున్న నేపథ్యంలో తమ బావమరిది గంగాధర్‌ను వైద్య ఖర్చుల కోసం డబ్బులు అడిగాడని పోలీసులు గుర్తించారు. అయితే డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో గంగాధర్‌పై కక్ష పెంచుకున్న నిందితుడు, బుధవారం ఉదయం పిల్లవాడిని అపహరించి ఘాతుకానికి పాల్పడ్డాడని దర్యాప్తులో బయటపడింది. ఎస్ఐ నరసింహుడు వివరించిన ప్రకారం, నిందితుడు ప్రసాద్ ఇంటినుంచి బాలుడిని తీసుకెళ్లి గ్రామానికి సమీపంలోని ఓ పాడుబడిన ప్రదేశంలో హత్య చేశాడు. ఘటన వెలుగులోకి రాగానే ప్రాంత ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అమాయక బాలుడి ప్రాణం బలికావడంతో గ్రామంలో దుఃఖ వాతావరణం నెలకొంది. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రకటించారు. బాలుడి కుటుంబానికి న్యాయం జరిగేలా దర్యాప్తు వేగంగా కొనసాగుతోంది.


# ఇండోనేషియాలో మరోసారి భారీ భూకంపం

**'రింగ్ ఆఫ్ ఫైర్'పై ఆందోళనలు పెరుగుతున్నాయి**

**సుమత్రా దీవిలో 6.3 తీవ్రతతో భూ ప్రకంపనలు**

**10 కిలోమీటర్ల లోతులో ఎపి సెంటర్ గుర్తింపు**

**సునామీ ముప్పు లేదని అధికారులు ధృవీకరణ**



**జకార్తా, 27 నవంబర్**
ఇండోనేషియాలో భారీ భూకంపాలు వరుసగా సంభవిస్తున్న నేపథ్యంలో, ఈ ఉదయం మరోసారి భూమి తీవ్రంగా కంపించింది. సుమత్రా దీవిలోని ఏస్ ప్రావిన్స్ సమీపంలో రిక్టర్ స్కేలుపై 6.3 తీవ్రతతో భూకంపం నమోదైందని ఇండోనేషియా వాతావరణ, క్లైమాటాలజీ మరియు జియోఫిజిక్స్ ఏజెన్సీ ప్రకటించింది. ఈ ఘటనతో అక్కడి ప్రజల్లో భయాందోళనలు చెలరేగాయి. పసిఫిక్ మహాసముద్రంలోని అగ్నిమయ వలయం 'రిం?గ్ ఆఫ్ ఫైర్' ప్రాంతంలో ఉన్నందున ఇండోనేషియాలో ఇలాంటి ప్రకంపనలు తరచూ నమోదు కావడం విశేషమే. ఈ భూకంపం భూమి ఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతులో చోటుచేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. భూకంప కేంద్రానికి సమీప ప్రాంతాల్లోని ప్రజలు దాదాపు 10 నుంచి 12 సెకండ్లపాటు కంపనలు అనుభవించారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఏస్ ప్రావిన్స్‌తో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కూడా ఇళ్లు కంపించడంతో ప్రజలు బయటకు పరుగులు తీశారు. పాత భవనాలు, బలహీన నిర్మాణాలున్న ప్రాంతాల్లో స్వల్ప నష్టం జరిగినట్లు ప్రాథమిక సమాచారం. భూకంప తీవ్రత ఎక్కువగా నమోదైనప్పటికీ, సునామీ ముప్పు లేదని అధికారికంగా ప్రకటించింది. రిక్టర్ స్కేలు 6 కంటే ఎక్కువ ఉన్న భూకంపాల తర్వాత సాధారణంగా సునామీ ముప్పు ఉండే అవకాశం ఉన్నప్పటికీ, ఈ ఘటనలో అలాంటి పరిస్థితి లేదని అధికారుల వెల్లడింపు ప్రజల్లో కొంత నెమ్మదింపునిచ్చింది. సముద్రతలంలో ఒత్తిడి మార్పులు కనిపించలేదని శాస్త్రవేత్తలు తెలిపారు. ఇండోనేషియా పసిఫిక్ మహాసముద్రంలోని 'రింగ్ ఆఫ్ ఫైర్'లో ఉన్నందున భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు ఎంతో సాధారణం. 2024, 2025 సంవత్సరాల్లో వరుసగా పలువురు ప్రావిన్స్‌లలో భూకంపాలు నమోదవడంతో ప్రపంచ శాస్త్రవేత్తలు ఈ ప్రాంతంపై మరింత అధ్యయనం చేస్తున్నారు. ఈ రోజు నమోదైన ప్రకంపనలు మరోసారి ఆ ప్రాంత భౌగోళిక అస్థిరతకు సంకేతం ఇస్తున్నాయని జియోఫిజిక్స్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# మర్డర్‌ను రోడ్డు ప్రమాదంగా చిత్రీకరణ

**- దర్యాప్తులో హత్యగా తేల్చిన పోలీసులు - గద్వాల జిల్లాలో మాజీ సర్పంచ్ హత్య కేసు ఛేదన**

**గద్వాల,నవంబర్ 27:** ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన ఓ మాజీ సర్పంచ్ కేసును పోలీసులు ఛేదించారు. ఇది హత్యగా ధృవీకరించారు. ఓ పక్కా ప్లాన్ ప్రకారం మాజీ సర్పంచ్‌ను మట్టుపెట్టారని గుర్తించారు. బొలెరో వాహనం వెనుక నుంచి ఢీకొన్న ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ మాజీ సర్పంచి ఇటీవల ప్రాణాలు కోల్పోయారు. అంతా రోడ్డు ప్రమాదమని భావించారు. కుటుంబ సభ్యులు మాత్రం ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా అనుమానించి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు దర్యాప్తు చేపట్టి వారం రోజుల్లో కేసును ఛేదించారు. పైకి కనిపిస్తున్నట్లు అది ప్రమాదం కాదని.. రూ.25 లక్షలు సుపారీ ఒప్పందం కుదుర్చుకుని, నెల రోజులు రెక్కీ నిర్వహించి.. పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా నిర్ధరించారు. జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండలం నందిన్నె మాజీ సర్పంచి చిన్నభీమ రాయుడిని సుపారీ గ్యాంగ్‌తో హత్య చేయించడం జిల్లాలో సంచలనం రేపింది. కేసు వివరాలను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మీడియా సమావేశంలో వెల్లడించారు. ఈనెల 21న నందిన్నె మాజీ సర్పంచి చిన్నభీమ రాయుడు ద్విచక్ర వాహనంపై గద్వాల నుంచి సొంతూరు నందిన్నెకు బయల్దేరారు. వెనుక నుంచి వచ్చిన బొలెరో ఆయన్ను బలంగా ఢీకొట్టింది. కొద్ది దూరం వాహనం సహా లాక్కెళ్లింది. ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. బొలెరో ముందు భాగంలో బైక్ ఇరుక్కు పోయింది. దీంతో డ్రైవర్ సహా.. అందులో ఉన్నవారంతా పరారయ్యారు. ఈ ఘటనను తొలుత ప్రమాదంగా భావించారు. కానీ, కుటుంబ సభ్యులు మాత్రం ప్రమాదం జరిగిన తీరు చూసి ఉద్దేశ్య పూర్వకంగానే ఢీ కొట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు వారం రోజుల్లో ప్రమాదం వెనక మిస్టరీని ఛేదించారు. రూ.25లక్షల సుపారీ కుదుర్చుకుని పక్కా ప్రణాళిక ప్రకారం చేసిన హత్యగా పోలీసులు నిర్ధరించారు. నందిన్నె గ్రామానికి చెందిన మిల్లు వీరన్న అలియాస్ కురువ వీరన్నకు.. మృతుడు చిన్నభీమ రాయుడికి మధ్య భూ వివాదాలు, రాజకీయ కక్షలు ఉన్నాయి. వీరన్న రైస్ మిల్లులో అక్రమాలపై అధికారులు సోదాలు నిర్వహించి కేసు నమోదు చేశారు. దీంతో చిన్నభీమ రాయుడిపై వీరన్న మరింత కక్ష పెంచుకున్నాడు. ఆయన్ను హత్య చేయించేందుకు కర్నూలుకు చెందిన ఈశ్వరయ్య గౌడ్‌తో రూ.25 లక్షలు సుపారీ ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాడు. హత్యచేసి దాన్ని ప్రమాదంగా చిత్రీకరిస్తే నేరం తమపైకి రాకుండా ఉంటుందని ప్రణాళిక రచించాడు. నెలరోజులు రెక్కీ నిర్వహించారు. నాలుగు సార్లు హత్యాయత్నం చేసినా.. పరిస్థితులు అనుకూలించలేదు. ఈ నెల 21న అదునుచూసి జాంపల్లి బస్టాండ్‌కు సమీపంలో చిన్నభీమ రాయుడు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. చనిపోయాడని నిర్ధరించుకునే వరకూ బైక్ సహా ఈడ్చుకెళ్లారు. బైక్ ముందు భాగంలో ఇరుక్కుపోవడంతో అక్కడే వదిలేసి పరారయ్యారు. ఈ కేసులో మిల్లు వీరన్న సహా 10మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.

# రైతులను దెబ్బతీస్తున్న తుఫాన్లు !

మరో తుఫాన్ ద్వితాహ్ దూసుకుని వస్తోంది. అంది ఎంతటి బీభత్సం సృష్టిస్తుందో అన్న బెంగపట్టుకుంది. తుఫాన్లు వచ్చినప్పుడల్లా రైతన్నలు వణుకుతున్నారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఏ ఒక్క రైతుకు సక్రమంగా నష్టపరిహారం అందడం లేదు. అందుకే తుఫాన్లు వస్తున్నాయంటే రైతులకు కన్నీరు రావడంతో పాటు, కంటిమీద కునుకు లేకుండా పోతోంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఊకదంపుడు ఉపన్యాసాలతో రైతులను ముంచేస్తున్నారు. అటు కేంద్రం ఆలస్యంగా సర్వే బృదాలను పంపడం, వారు లెక్కలు వేసి పంపే అరకొర సాయం ఎప్పుడో రైతుల ఖాతాల్లోకి పడుతుందో తెలియని దుస్థితి ఉంది. అందుకే ఇప్పుడు పంటలను త్వరగా అమ్ముకునే దుస్థితిలో ఉన్నారు. తుఫాన్ రానుందన్న హెచ్చరికలతో ధాన్యం నూర్పి అమ్మకాలు సాగిస్తున్నారు. తీరప్రాంతం ప్రకృతి విపత్తులకు శాశ్వత కేంద్రంగా మారింది. రైతులు, వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులతో పాటు వివిధ వృత్తులపై ఆధారపడే లక్షలాది మంది ప్రతి ఏటా ఏదో రకంగా నష్టపోతూనే ఉన్నారు. భౌగోళిక పరిస్థితుల కారణంగా సహజ విపత్తుల కడలిలో మనుగడ సాగించక తప్పని స్థితి దాపురించింది. ప్రతి ఏడాది రాష్ట్రంపై తుపాన్లు విరుచుకుపడుతున్నాయి. ఈ ఏడాది విరుచుకుపడిన మొంథా తుపాను కూడా తీరని నష్టాన్నే మిగిల్చింది. ఇప్పటికీ అనేకమందికి సరైన పరిహారం అందడం లేదు. ప్రభుత్వాలు ప్రకటించే సాయం అరకొరగా ఉంటున్నాయి. ఇటీవల నష్ట తీవ్రతను అంచనా వేయడానికి వచ్చిన కేంద్ర బృందానికి రైతులు ఇదే విషయాన్ని వివరించారు. తుపాన్ల కారణంగా రాష్ట్రం తరచూ ప్రభావితమౌ తోందని, ముందస్తు హెచ్చరికలు చేస్తున్నా, నష్టాన్ని నివారించలేకపో తున్నామంటూ కేంద్ర బృందా నికి సిఎం చంద్రబాబు కూడా చెప్పారు. పెరిగిన సాంకేతికత కారణంగా ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గించినప్పటికీ, పంట నష్టాన్ని, ఆస్తి నష్టాన్ని అదుపు చేయడం సాధ్యం కావడం లేదు. పైగా వాతావరణ మార్పుల కారణంగా విపత్తుల తీరు కూడా మారింది. ఊహించని చోట, ఊహించని విధంగా గంటల తరబడి కుండపోతగా వర్షం కురవడం, వాగులు, వంకలు పొంగి అనూహ్య వరదలు చోటు చేసుకోవడం, విపరీతమైన వేగంతో గాలి వీచడం వంటి వైపరీత్యాలు సాధారణంగా మారుతున్నాయి. దీంతో నష్టం భారీగా పెరుగుతోంది. ఈ క్లిష్ట పరిస్థితుల్లో ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది. నిజానికి మొంథా తుపాన్ ప్రభావం చాలా తీవ్రంగా ఉంది. ప్రభుత్వ లెక్కల ప్రకారమే రాష్ట్రంలోని 443 మండలాల్లోని 3,109 గ్రామాలు తుపాను బారినపడ్డాయి. దాదాపు 10 లక్షల మంది ప్రజలు తుపాను కారణంగా తీవ్రంగా ప్రభావితమయ్యారు. 1.11 లక్షల మంది నిరాశ్రయులైనారు. 1.61 లక్షల హెక్టార్లలో పంటలు నీట మునిగి, 3.27 లక్షల మంది రైతులు నష్టపోయారు. ప్రభుత్వ ఆస్తులకు జరిగిన నష్టమూ ఉంది. అయితే, ప్రభుత్వం రూపొందించిన ఈ లెక్కల మీద కూడా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇటీవలి మొంథా తుపాను కారణంగా రాష్ట్రంలో 6,384 కోట్ల రూపాయల నష్టం సంభవించినట్లు రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు రూపొందించిన నివేదికలో వ్యవసాయం, మత్స్యకార, చేనేత, పశు సంవర్ధక రంగాలతో పాటు విద్యుత్, రహదారులు, ఇళ్లు, విద్యా సంస్థలు తీవ్రంగా దెబ్బ తిన్నట్లు ప్రభుత్వం పేర్కొంది. తక్షణ సాయంగా 2,622 కోట్ల రూపాయలు విడుదల చేయాలని, తీరప్రాంతంలో సముద్ర కోత నివారణ పనుల కోసం ఉప్పాడకు రూ.323 కోట్లు, విశాఖ సమీప ప్రాంతాలకు రూ.203 కోట్లు, శ్రీకాకుళం ప్రాంతానికి రూ.98 కోట్లు మంజూరు చేయాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరింది. పంటల బీమా లేకపోవడంతో నష్టాన్ని ఉద్దేశపూర్వకంగానే తగ్గించి చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్యూమరేషన్ సమయంలో తమను విస్మరిస్తున్నారంటూ కౌలు రైతులు అనేకచోట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశాలను కూడా పరిగణలోకి తీసుకుంటే నష్ట తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉంది. గతంతో పోలిస్తే నష్టం అంచనా కోసం కేంద్ర బృంద త్వరగా పర్యటించి, అంచనాలు వేసినా అవి డబ్బురూపంలోకి వచ్చేది ఎప్పుడో చెప్పలేం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి కేంద్రం సానుకూలంగానే స్పందించిది. అయితే, ఇదొక్కటే చాలదు. కేంద్ర బృందం పర్యటించినంత మాత్రాన నిధులు ఇచ్చినట్లు కాదు. కష్టకాలంలో రాష్ట్రాన్ని ఆదుకోవాలన్న చిత్తశుద్ధి కేంద్రానికి ఉండాలి. విపత్తుల సమయంలో నష్టపోయిన రైతులకు తక్షణ సాయం అందించే వ్యవస్థ రావాలి. అత్యవసర సాయం కింద ఎంతో, కొంత నిధులు వెంటనే ఇచ్చేలా ఏర్పాటు చేయాలి. ఈ నేపథ్యంలో విపత్తు అంచనాలు లెక్కకట్టేందుకు వచ్చే కేంద్ర బృందం పర్యటన తరువాతైనా కేంద్రం ఉదారంగా స్పందించాలి. రాష్ట్ర ప్రభుత్వం అడిగిన తక్షణ సాయాన్ని వెంటనే విడుదల చేయడంతో పాటు, పూర్తిస్థాయి పరిహారాన్ని సాధ్యమైనంత త్వరగా విడుదల చేయగలగాలి. హుద్‌హుద్ తుపాన్ సందర్భంలో కేంద్ర ప్రభుత్వం చూపిన నిర్లక్ష్యాన్ని రాష్ట్ర ప్రజలు మరచిపోలేదు. అటువంటి పరిస్థితి పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం చూసుకోవాలి. అదే సమయంలో రైతులు, కౌలురైతులతో పాటు నష్టపోయిన ప్రతి ఒక్కరికి న్యాయం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే! ఆ మేరకు అవసరమైతే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి సిద్ధపడాలి. అలాగే ఇందుకోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకుని రావాలి. ప్రత్యేక నిధి ఉంటే తుపాన్ల సమయంలో నష్టపోయిన రైతులకు, ప్రజలను తోణం అదుకునే వీలుంటుంది.

# నల్లచెరువు ఆక్రమణలపై తప్పుదారిపట్టించే ప్రచారం

**అసలు నిజాలు వెల్లడించిన హైడ్రా**

**176 సర్వే నంబర్‌లోని షెడ్లు స్వయంగా ఖాళీ చేసిన చెత్త సేకరణదారులు**

**180 సర్వే నంబరుతో నష్టం పరిహారం కోసం కొందరి కొత్త హైడ్రామా**

**పరిసర కాలుష్యంపై కోర్టును అప్రమత్తం చేసిన హైడ్రా**



**హైదరాబాద్, 27 నవంబర్** కూకట్‌పల్లి నల్లచెరువు చుట్టూ అక్రమ నిర్మాణాలు, ఆక్రమణలపై హైడ్రా చర్యలు తీసుకుంటున్న సమయంలో కొందరు ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు హైడ్రా స్పష్టం చేసింది. బుధవారం చెరువు పరిధిలో ఎలాంటి కొత్త ఆక్రమణలను తొలగించలేదని, 176 సర్వే నంబరులో ఉన్న తాత్కాలిక షెడ్లను ఇప్పటికే ఖాళీ చేయించామని హైడ్రా తెలిపింది. చెత్త సేకరణదారులు, స్క్రాప్ వేరుచేసి అమ్ముకునే వారు ప్లాస్టిక్ కవర్లతో వేసుకున్న తాత్కాలిక షెడ్లు చెరువు ఫుల్ ట్యాంక్ పరిధిలోకి రావడంతో, నోటీసులిచ్చి స్వచ్ఛందంగా వెళ్లిపోయారని సంస్థ వివరించింది. నల్లచెరువు 176 సర్వే నంబరులోని తాత్కాలిక గుడిసెలు చెరువులోకి చెత్త చేరడం, నీటి కాలుష్యానికి కారణమవుతుం డటంతో హైడ్రా కోర్టును అప్రమత్తం చేసింది. హైకోర్టు కూడా ఇదే విషయం గమనించి, సర్వే నంబర్లు పరిశీలించి, నోటీసులిచ్చి ఖాళీ చేయించాలంటూ సూచించింది. దీనితో రెండు మూడు రోజుల క్రితమే అక్కడ ఉన్న చెత్త సేకరణదారులు స్వయంగా గుడిసెలు ఖాళీ చేసి వెళ్లిపోయారు. ఇది పూర్తిగా చట్టపరమైన చర్య మాత్రమేనని హైడ్రా స్పష్టం చేసింది. అయితే, ఈ పరిస్థితులను అవకాశంగా తీసుకుని కొందరు వ్యక్తులు 180 సర్వే నంబర్‌ను చూపుతూ పేదల గుడిసెలను కబ్జా ప్రయత్నంగా చూపించి గందరగోళాన్ని సృష్టిస్తున్నారని హైడ్రా ఆరోపించింది. వాస్తవానికి 180 సర్వే నంబరుపై ఎలాంటి చర్యలూ చేపట్టలేదని, అక్కడి కొందరు మూడో వ్యక్తులు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తూ పేదలను అడ్డంకులుగా వాడుకుంటున్నారని సంస్థ వెల్లడించింది. కొంతమంది 180 సర్వే నంబర్‌ను చూపిస్తూ నష్టపరిహారం కోసం హైకోర్టును కూడా ఆశ్రయించినట్లు సమాచారం. హైడ్రా అధికారులు పేర్కొన్నదేమిటంటే చెరువు పరిరక్షణ, ఫుల్ ట్యాంక్ స్థాయి సంరక్షణ, నీటి నాణ్యత కాపాడటం తమ బాధ్యతగా చూస్తున్నామని. సర్వే నంబర్లు క్లియర్‌గా చెక్ చేసి, కోర్టు సూచనల మేరకు మాత్రమే చర్యలు చేపడుతున్నామని హైడ్రా తెలిపింది. నల్లచెరువు చుట్టూ ఉన్న అక్రమ కార్యకలాపాలు, కబ్జా ప్రయత్నాలు, కాలుష్య సమస్యలు పూర్తిగా పరిష్కారమయ్యే వరకు చర్యలు కొనసాగుతాయని అధికారులు పేర్కొన్నారు.

# మాక్ అసెంబ్లీతో కనువిప్పు కావాలి

**జగన్‌కు యనమల చురకలు**

**అమరావతి,నవంబర్27:** విద్యార్థుల మాక్ అసెంబ్లీ జగన్‌కు కనువిప్పు కావాలని మాజీ స్పీకర్, టిడిపి నేత యనమల రామకృష్ణుడు అన్నారు. సభలో ప్రతిపక్షం ఎలా వ్యవహరించిందో చూసైనా వైకాపా అధినేత జగన్ నేర్చుకోవాలని యనమల రామకృష్ణుడు హితవు పలికారు. చిన్న పిల్లలైనా ఎలాంటి తాత్కాలిక, శాశ్వత బహిష్కరణలకు తావివ్వకుండా, ప్రజా సమస్యలను సభలోనే ప్రస్తావిస్తూ బాధ్యతాయు తంగా వ్యవహరించారని గుర్తుచేశారు. కనీసం ఇప్పటికైనా జగన్ అసెంబ్లీకి హాజరై ప్రజా సమస్యలపై చర్చించాలన్నారు. సభ వెలుపల మాట్లాడటం కంటే, ప్రజాప్రతినిధిగా సభలో హాజరై చర్చించడం ముఖ్యమని ఇప్పటికైనా తెలుసుకోవాలని సూచించారు. లేదంటే త్వరలోనే అర్హత కోల్పోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. బుధవారం అమరావతిలో నిర్వహించిన మాక్ అసెంబ్లీలో విద్యార్థులే ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి సభ నడిపిన విషయం తెలిసిందే.

# రాష్ట్ర ప్రయోజనాలపై ఎంపీలతో భట్టి విక్రమార్క సమీక్ష

**కేంద్రంలో పెండింగ్ అంశాలపై దృష్టి**

**బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లు కోసం తొమ్మిదవ షెడ్యూల్ సవరణపై చర్చ**

**ఢిల్లీలో ప్రత్యేక విభాగం ఏర్పాటు - సమాచారాన్ని వెంటనే అందించడమే లక్ష్యం**

**విజన్ 2047, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం పై సమగ్ర ప్రణాళిక సిద్ధం**



**హైదరాబాద్, 27 నవంబర్** రాష్ట్ర ప్రభుత్వ ప్రయోజనాలను కేంద్ర స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గురువారం ప్రజాభ వన్‌లో రాష్ట్ర ఎంపీలతో విస్తృత సమీక్ష సమావేశం నిర్వహించారు. కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న పలు అత్యవసర అంశాలు, అభివృద్ధి ప్రాజెక్టులు, నిధుల విడుదల వంటి విషయాలపై ఎంపీలతో కలిసి వ్యవస్థపూర్వక చర్చ సాగింది. "రాష్ట్ర ప్రయోజనాల కోసం అన్ని పార్టీల ఎంపీలు ఒక మాట కావాలి" అని భట్టి విక్రమార్క స్పష్టంగా పేర్కొన్నారు. సమావేశంలో బీసీలకు 42% రిజర్వేషన్ బిల్లు ఆమోదానికి తొమ్మిదవ షెడ్యూల్‌లో సవరణ అత్యవసరమని నొక్కిచెప్పారు. ఈ అంశాన్ని పార్లమెంటులో అడ్జర్న్‌మెంట్ మోషన్, ప్రశ్నోత్తరాల ద్వారా బలంగా ముందుకు తేవాలని ఎంపీలకు సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పూర్తికేబినెట్‌తో కలిసి ప్రధానమంత్రిని కలసి వినతిపత్రం సమర్పించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కేంద్రం వద్ద ఉన్న పెండింగ్ సమస్యలపై సమగ్ర మద్దతు తీసుకురావడమే ఈ చర్యల లక్ష్యమని ఆయన అభిప్రాయపడ్డారు. ఎంపీలకు అవసరమైన సమాచారం వెంటనే అందించేందుకు ఢిల్లీలో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. రాష్ట్రానికి సంబంధించిన విద్యుత్, నీటిపారుదల, మౌలిక సదుపాయాలు సహా పలు శాఖల్లో పెండింగ్‌లో ఉన్న నిధుల వివరాలు అక్కడ సిద్ధంగా ఉంచుతు న్నామని తెలిపారు. పార్లమెంట్ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎంపీలు కేంద్రంలో రాష్ట్ర సమస్యలను బలంగా ప్రస్తావించేందుకు అవసరమైన డేటా%-%డాక్యుమెంట్లను అందించే విధంగా ఈ విభాగం పనిచేస్తుందని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన విజన్ 2047 డాక్యుమెంట్, రాబోయే గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు, 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక లక్ష్యం వంటి అంశాలను కూడా చర్చించారు. డిసెంబర్ 9న ప్రజా ప్రభుత్వం రెండేళ్లు పూర్తిచేయనున్న సందర్భంగా ప్రభుత్వ విజయాలు, లక్ష్యాలను ప్రకటించేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన తెలిపారు. కేంద్రానికి సంబంధించిన 12 శాఖలపై 47 పెండింగ్ అంశాలను ఈ సమావేశంలో గుర్తించి, సెమికం డక్టర్ రంగంపై పెట్టుబడులు, కేంద్ర సహకారం సాధ్యాసాధ్యాలపై కూడా చర్చ సాగింది.

# పొలంలో రూ.500 నోట్లు నాటి వినూత్న నిరసన

**బీమా నష్టపరిహారం కోసం రైతు ఆవేదన**

**అధిక వర్షాలతో పత్తి పొలం పూర్తిగా నాశనం**

**ఫిర్యాదు చేసినా స్పందించని అధికారులు, బీమా సంస్థ**

**వైరల్ వీడియోతో న్యాయం దక్కాలని ఎదురు చూపు**



**జైపూర్, 27 నవంబర్** రాజస్థాన్‌లో ఒక రైతు బీమా నష్టపరిహారం కోసం వినూత్న రీతిలో నిరసన తెలిపాడు. భారీ వర్షాల కారణంగా పత్తి పంట పూర్తిగా నష్టపోయినప్పటికీ, బీమా సంస్థ నుంచి ఎలాంటి పరిహారం రాకపోవడంతో ఆవేదన చెందిన మల్లారం బవారీ తన పొలంలో రూ.500 కరెన్సీ నోట్లు నాటాడు. ఈ వినూత్న నిరసనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. రైతు సమస్యలపై అధికారుల నిర్లక్ష్యాన్ని ఇది మరోసారి వెలుగులోకి తెచ్చింది. నాగౌర్ జిల్లాలోని డియోరియా జతన్ గ్రామానికి చెందిన మల్లారం పత్తి సాగు కోసం బ్యాంకు నుంచి లక్ష రూపాయల రుణం తీసుకున్నాడు. పంటకు బీమా కూడా చేయించుకున్నాడు. అయితే గత వారం కురిసిన భారీ వర్షాల కారణంగా అతడి పత్తి పొలం పూర్తిగా నీట మునిగిపోయింది. దాదాపు మొత్తం పంట నాశనమవగా, కేవలం రూ.4,000 విలువైన పత్తినే కష్టపడి రాబట్టగలిగాడు. ఈ నేపథ్యంలో బీమా సంస్థకు ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన రాలేదని రైతు వాపోయాడు. తన నష్టాన్ని గుర్తించేందుకు ఏ అధికారి కూడా తన పొలాన్ని సందర్శించలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ పరిస్థితుల్లో వ్యవసాయదారుల సమస్యలు ఎవరూ పట్టించుకోవడం లేదని భావించిన మల్లారం అసహనంతోనే వినూత్న నిరసనకు దిగాడు. తన పొలంలో వరుసగా గుచ్చి పెట్టిన రూ.500 నోట్లు, రైతు ఆవేదనకు ప్రతీకగా మారాయి. ఈ దృశ్యాలను చిత్రీకరించి సోషల్ మీడియాలో పోస్టు చేయగా, వీడియో విస్తృతంగా వైరల్ అయింది.

వీడియో వైరల్ కావడంతో ఇప్పుడు అయినా అధికారులు స్పందించి తన పంటకు సరైన నష్టపరిహారం చెల్లిస్తారేమోనని రైతు ఆశగా ఎదురు చూస్తున్నాడు. వరుసగా ప్రకృతి విపత్తులు, పంట బీమా వ్యవస్థలో లోపాలు, అధికారులు పట్టించుకోకపోవడం వంటి సమస్యలు రైతులను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టేస్తున్నాయనే విమర్శలు వస్తున్నాయి. మల్లారం ఘటన రైతుల సమస్యలపై వ్యవస్థ దృష్టిని మరల ఆకర్షించే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు.



# ట్రోలర్స్‌కు ఇచ్చిపడేసింది

సెలబ్రెటీల లైఫ్ లో సోషల్ మీడియా పెద్ద పాత్ర పోషిస్తుంది. సినిమా సెలబ్రెటీలకు సోషల్ మీడియాలో ఎంత క్రేజ్ ఉంటుందో.. దాని వల్ల నష్టం కూడా అంతే ఉంటుంది. సోషల్ మీడియా ద్వారా చాలా మంది సెలబ్రెటీలు, ముఖ్యంగా హీరోయిన్స్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతే కాదు హీరోయిన్స్ చాలా మంది లేనిపోని వివాదాల్లో ఇరుక్కుంటూ ఉంటారు. దాంతో సోషల్ మీడియాలో నెటిజన్స్ ఓ రేంజ్‌లో ట్రోల్స్ చేస్తూ ఉంటారు. వివాదాస్పద కామెంట్స్ చేసో లేక, వింత డ్రస్సుల వల్లో ఎదో ఒకరకంగా ట్రోల్స్ కు గురవుతూ ఉంటారు. కొంతమంది హీరోయిన్స్ తమ డ్రస్సింగ్ కారణంగా ట్రోల్స్ బారిన పడుతూ ఉంటారు. మరికొంతమంది సర్జరీల విషయంలో ట్రోల్ చేస్తుంటారు తాజాగా ఓ హీరోయిన్ ను సోషల్ మీడియాలో దారుణంగా ట్రోల్ చేశారు. సర్జరీల విషయంలో హీరోయిన్ పై ట్రోల్స్.. దానికి ఆ స్టార్ హీరోయిన్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది. అందాల భామ శ్రుతీహాసన్ ఆచితూచి సినిమాలు చేస్తుంది. రీసెంట్ డేస్ లో వరుసగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ హిట్స్ అందుకుంటుంది ఈ ముద్దుగుమ్మ. కెరీర్ బిగినింగ్‌లో సక్సెస్ కోసం ఎంతగానో ఎదురుచూసిన శ్రుతిహాసన్ ఆ తర్వాత వరుసగా విజయాలను అందుకుంది. తక్కువ సమయంలోనే ఈ బ్యూటీ స్టార్ హీరోయిన్‌గా మారిపోయింది. స్టార్ హీరోల సినిమాల్లో ఛాన్స్‌కు అందుకుంటూ దూసుకుపోతుంది. తెలుగు తమిళ్ సినిమాల్లో హీరోయిన్‌గా రాణిస్తుంది శ్రుతిహాసన్.శ్రుతిహాసన్ అందం పై ట్రోల్స్ వినిపిస్తూ ఉంటాయి. ఆమె అందం కోసం సర్జరీ చేయించుకుందని.. అందుకే ఆమె ఇంత అందంగా ఉందని పలువురు ఆమె పై ట్రోల్స్ చేస్తున్నారు. తాజాగా ఆ ట్రోల్స్ పై స్పందించింది శ్రుతి.. రైనో ప్లాస్టి అనే సర్జరీ గురించి, అలాగే లిప్ ఫిల్లర్స్ గురించి మాట్లాడింది. ఇది నా శరీరం, నా ఇష్టం అలానే నాకు నచ్చిన నిర్ణయం నేను తీసుకుంటాను అని చెప్పుకొచ్చింది శృతిహాసన్.అలాగే రైనో ప్లాస్టి అనేది ముక్కుకు చేసే సర్జరీ.. అంది అందం కోసమే కాదు అంతకు ముందు నా ముక్కుకు గాయం అయ్యింది అనికోసమే సర్జరీ చేయించుకున్నా అని తెలిపింది శ్రుతి.

## వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదు

### కుటుంబ వివాదంపై స్పందించిన మంచు లక్ష్మి



తన కుటుంబంలో ఇలాంటి వివాదాలు ఎదురవుతాయని ఏ రోజూ ఊహించలేదని నటి మంచు లక్ష్మి స్పష్టం చేశారు. సినిమా ప్రచారాల కోసం ఇచ్చే ఇంటర్వ్యూలకు తప్ప, ప్రత్యేకంగా వ్యక్తిగత చర్చల కోసం మాట్లాడటానికి పెద్దగా ఆసక్తి చూపబోనని తెలిపారు. ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, తల్లి–సోదరి–కుమార్తెగా తన పాత్రల గురించి మాట్లాడుతూ, తల్లిగా మాత్రం తనను తాను 10కి 10 మార్కులు వేసుకుంటానని చెప్పింది. మంచు కుటుంబంలో జరిగిన విభేదాలపై కూడా ఆమె స్పందించారు. 'దేవుడు ప్రత్యక్షమై ఒక వరం కోరుకోమంటే... మా కుటుంబం మళ్లీ మునుపటిలాగే ఒక్కటిగా మారాలని మాత్రమే అడుగుతానని అన్నారు. ప్రతి కుటుంబంలోనూ గొడవలు ఉండటం సహజమే అయినా, ఎంత విభేదాలు వచ్చినా చివరకు అందరూ కలిసే ఉండాలనే భావన మనసులో నిలిచి ఉండాలని ఆమె పేర్కొన్నారు. భారతీయ కుటుంబాల్లో మాత్రం కొన్ని సందర్భాల్లో కలహాలు జీవితాంతం విరిగిపోనివ్వాలని భావించే ధోరణి కనిపిస్తుందని, అది సరికాదని వ్యాఖ్యానించారు. 'చివరికి మనకుండేది రక్తసంబంధీకులే. కుటుంబాన్ని కలిసి ఉంచేందుకు అవసరమైన పోరాటం చేయాలిబీ దూరం పెంచుకోవడం మాత్రం ఎప్పుడూ సరైంది కాదని తెలిపారు. 'నేను ముంబయిలో ఉన్నాను. ఇక్కడి పరిస్థితులు తెలిసినా బాధపడలేదని కొందరు వార్తల్లో రాశారు. కానీ నేను పొందిన బాధను నాకు మాత్రమే తెలుసనని మంచు లక్ష్మి చెప్పారు. వివాదాలపై తాను మాట్లాడకపోవడంతో, కొందరు తమకు నచ్చినట్లుగా ఊహాగానాలు సృష్టించారని చెప్పారు. అది నా వ్యక్తిగత విషయం. ఇలాంటి సమస్యలు వస్తాయని నేను ఊహించలేదు. వాటిని చూసి షాక్ అయ్యాను. నా కుటుంబం గురించి నేను అనుకున్నది, ఆ పరిస్థితుల్లో నాకు కలిగిన బాధ బయటివాళ్లకు చెప్పాల్సిన అవసరం లేదని భావించానని ఆమె వ్యాఖ్యానించారు.

## 'ఛాంపియన్ ' భారీ అంచనాలు

హీరో శ్రీకాంత్ కుమారుడు రోషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న 'ఛాంపియన్' నుంచి ఫస్ట్ సింగిల్ 'గిరా గిరా' విడుదలైంది. మిక్కీ జే మేయర్ స్వరాలు, రామ్ మిరియాల గానం, కాసర్ల శ్యామ్ సాహిత్యం ఈ గ్రామీణ సాంగ్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిత్రంలో రోషన్ ఫుట్‌బాల్ ప్లేయర్‌గా కనిపిస్తుండగా, హీరోయిన్ అనస్వర రాజన్ 'తాళ్లపూడి చంద్రకళ'గా పరిచయమవుతోంది. గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా క్రిస్మస్ కానుకగా డిసెంబర్ 25న విడుదల కానుంది. సీనియర్ నటుడు శ్రీకాంత్ తనయుడిగా టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చి హీరోగా నిలదొక్కుకునేందుకు ప్రయత్నిస్తున్నాడు మేక రోషన్ . 'పెళ్లిసందడి'తో మంచి గుర్తింపు తెచ్చుకున్న అతడు నటనలో మెరుగులు దిద్దుకుంటూ క్రమంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పుడు ఆయన కెరీర్‌లో కీలక అడుగుగా భావిస్తున్న పీరియాడిక్ స్పోర్ట్స్ డ్రామా ' ఛాంపియన్ ' భారీ అంచనాల నడుమ తెరకెక్కుతోంది. ఈ సినిమాలో ఫుట్‌బాల్ ప్లేయర్‌గా రోషన్ నటించడం ఆసక్తిగా మారింది. ప్రదీప్ అద్వైత్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'ఛాంపియన్' చిత్రాన్ని స్వప్న సినిమాస్, జీ స్టూడియోస్, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం షూటింగ్ చివరి దశలో ఉంది. డిసెంబర్ 25న క్రిస్మస్ కానుకగా ఈ సినిమాను విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీని రేపింది. పీరియాడిక్ వాతావరణం, గ్రామీణ నేపథ్యం, స్పోర్ట్స్ ఎమోషన్స్ అన్నీ కలిసి ఈ సినిమా యూత్ మరియు ఫ్యామిలీ ప్రేక్షకులను బాగా ఆకట్టుకునేలా కనిపిస్తోంది. తాజాగా మూవీ టీమ్ ఫస్ట్ సింగిల్‌ను విడుదల చేసింది. 'గిర గిర గిరగింగిరా గిరే' అనే ఈ గ్రామీణ మట్టివాసనతో నిండిన పాట మట్టిలో పెరిగిన మనుషుల నైజం, వారి రోజువారీ జీవితాలను సహజంగా చూపిస్తోంది. ప్రముఖ సంగీత దర్శకుడు మిక్కీ జే మేయర్ ఈ సాంగ్‌కు స్వరాలు సమకూర్చగా, రామ్ మిరియాల తనదైన భిన్నమైన ఫోక్ స్టైల్‌తో పాటకు ప్రాణం పోశాడు. కాసర్ల శ్యామ్ రాసిన సాహిత్యం గ్రామీణ వాతావరణాన్ని అచ్చుగుద్దినట్టు ప్రతిబింబించింది.

## ఎల్లమ్మ సినిమా చేయడం లేదు

సౌత్ ఇండియన్ స్టార్ నటి కీర్తి సురేష్ చాలాకాలం తర్వాత మళ్లీ తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆమె చివరిగా నటించిన పెద్ద తెలుగు సినిమా మెగాస్టార్ చిరంజీవితో చేసిన 'భోళా శంకర్'. ఆ తర్వాత 2025లో సుహాస్‌తో చేసిన ఉప్పు కప్పురంబు విడుదలైనప్పటికీ, ఆ చిత్రం వచ్చిన సంగతే చాలా మందికి తెలియకుండా పోయింది. అవకాశాలు తగ్గాయా? లేక ఆమెకే ఆసక్తి తగ్గిందా? అనేది స్పష్టంగా తెలియకపోయినా, కీర్తి సురేష్ కొంతకాలంగా తెలుగు సినిమాల్లో కనిపించలేదు. దాదాపు విరామం తర్వాత కీర్తి సురేష్ నటిస్తున్న తాజా చిత్రం 'రివాల్వర్ రీటా'. దర్శకుడు చంద్రు రూపొందించిన ఈ లేడీ ఓరియెంటెడ్ మూవీ తెలుగులో కూడా విడుదల కానుంది. డైరెక్ట్ తెలుగు సినిమాతో కాకుండా, డబ్బింగ్ వెర్షన్‌తో తెలుగువారిని ఆకట్టుకోవడానికి కీర్తి సిద్ధమవుతోంది. తాజాగా రివాల్వర్ రీటా ప్రమోషన్ కోసం తెలుగులో ప్రెస్ మీట్ నిర్వహించారు మేకర్స్. ఈ సందర్భంలో సినిమా వివరాలతో పాటు రాబోయే ప్రాజెక్టుల గురించి కూడా కీర్తి సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒక రిపోర్టర్ చాలా కాలంగా ప్రచారంలో ఉన్న 'ఎల్లమ్మ' సినిమా గురించి ప్రశ్నించాడు. 'ఎల్లమ్మ సినిమాలో హీరోయిన్‌గా మీరు నటిస్తున్నారనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయం నిజమేనా? అని అడిగాడు. దీనికి కీర్తి స్పష్టంగా స్పందిస్తూ లేదు... నేను 'ఎల్లమ్మ' సినిమా చేయడం లేదని స్పష్టం చేసింది. 'ఎల్లమ్మ' చిత్రానికి కేవలం హీరోయిన్ ఎంపికలోనే కాదు, హీరో విషయంలో కూడా ఇప్పటివరకు స్పష్టత రాలేదు. నాని, శర్వానంద్, నితిన్, బెల్లంకొండ శ్రీనివాస్ వంటి పలువురు నటుల పేర్లు వినిపించగా, తాజాగా సంగీత దర్శకుడు దేవి శ్రీ ప్రసాద్ పేరు కూడా చర్చలోకి వచ్చింది. అయినప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌లో నిజంగా ఎవరు హీరోగా నటిస్తారు, ఎవరు హీరోయిన్‌గా ఉంటారు అన్నది ఇంకా తెలియరాలేదు. హీరోయిన్‌గా కీర్తి సురేష్ లేదన్న సంగతి మాత్రం స్పష్టమైంది. ఇక ఈ సినిమా ఎప్పుడు మొదలవుతుంది? నటీనటుల అధికారిక జాబితా ఎప్పుడెప్పుడు బయటకు వస్తుంది? అనేదానిపై మేకర్స్ నుంచి ప్రకటన వచ్చే వరకు వేచి చూడాల్సిందే.



Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# తొవ్వ ముచ్చట్లు ....( వ్యాసకర్తల అభిప్రాయాలు )

## ప్రతిభను గుర్తించుకునే రోజు

## ప్రతి మనిషిలో దాగి ఉన్న సామర్థ్యానికి వేడుక

### - స్వీయ గుర్తింపు అవసరం పెరుగుతున్న యుగం

### - ప్రతిభ అంటే పరీక్షల మార్కులు మాత్రమే కాదు

### - సమాజం అంగీకారం కాక ముందే, మనమే మనల్ని అంగీకరించాలి

ప్రపంచం వేగంగా మారుతున్న ఈ కాలంలో ప్రతిభ అనే భావనకు కొత్త నిర్వచనం ఏర్పడింది. మనలో ప్రతి ఒక్కరూ ఒక ప్రత్యేక వ్యక్తిత్వం, ప్రత్యేక నైపుణ్యం, ప్రత్యేక దృష్టికోణం కలిగి ఉంటాం. ఈ దాగి ఉన్న ప్రతిభను బయటపెట్టడం, మనల్ని మనం అంగీకరించడం, మన సామర్థ్యాన్ని విలువైనదిగా భావించడం ఇవన్నీ సూచించే ప్రధాన మార్మికాలు. సమాజం పెట్టే దోహదాల కంటే మన అంతరంగం ఇచ్చే ధైర్యమే మన అసలు స్వరూపాన్ని వెలిగిస్తుంది.ప్రతిభ అంటే పుస్తకాలలో ఉన్న జ్ఞానం, గ్రేడులు, పరీక్షల మార్కులు మాత్రమే కాదు. ఒకరికి పాట పాడటం చక్కని సామర్థ్యం అయితే, మరొకరికి మాటల ద్వారా హృదయాలను కదిలించే నైపుణ్యం ఉండొచ్చు. కొందరు చేతిపని లో నైపుణ్యం కలిగివుంటారు, మరికొందరు సమస్యను నిశితంగా అర్థం చేసుకునే సామర్థ్యం కలిగివుంటారు. పిల్లల్లో ఉండే చిన్న చిన్ని నైపుణ్యాలు చాలా సందర్భాల్లో ఇంటి పెద్దలకు కనిపించవుబీ కానీ అవే నైపుణ్యాలు భవిష్యత్ లో గొప్ప విజయాలకి మార్గం చూపుతాయి.ఈ రోజున ప్రధానంగా గుర్తుంచుకోవాల్సింది ఏంటంటే మన ప్రతిభను గుర్తించేది మొదట మనమే కావాలి. సమాజం అంగీకరించకముందే, మనకు మనమే అంగీకారం ఇవ్వాలి. ఎందుకంటే మనకన్నా మన బలహీనతలు, మన బలం, మన సాధ్యాలు ఎవరు ఎక్కువగా తెలుసుకోరు. తరచుగా మనల్ని మనం ఇతరులతో పోల్చడం వల్ల మన ప్రతిభను చిన్నచూపు చూస్తాం. అలాంటి పోలికలు మన ఆత్మవిశ్వాసాన్ని తగ్గిస్తాయి కానీ ప్రతిభను కాదు.ఈ తరహా ప్రత్యేక దినాలు మనకు ఒక్క విషయం గుర్తు చేస్తాయి. “మీరు ఎవరో, మీరేం చేయగలరో, మీలో ఏముంది” అనే ఆలోచనపై మనం ఒకసారి ఆగి ఆలోచించాలి. ప్రతి మనిషి ప్రయాణం ప్రత్యేకం. ఒకరి విజయాన్ని మరొకరి ప్రమాణంగా తీసుకోవడం సమంజసం కాదు. ప్రతిభను కొలిచే కొలమానాలు ఎన్నో. వాటిలో చాలా మనకు తెలియకపోవచ్చు కూడా. కాని ఆ ప్రతిభను వెలికి తీయాలంటే మనసును వినాలి, మన ఆలోచనలనుఆప్యాయంగా పరిశీలించాలి.




సోషల్ మీడియా ప్రపంచంలో ఇతరుల జీవితాలు మెరిసేలా కనిపిస్తాయి కాని నిజమైన విజయం మన వ్యక్తిగత భద్రత, మనశ్శాంతి, మన ప్రత్యేకతను కాపాడుకొని ముందుకు వెళ్లడంలో ఉంది. ఈ రోజున మనం ఒక చిన్న నిర్ణయం తీసుకుంటే చాలు “ఇతరుల మాటలతో కాదు, నా అంతరంగ స్వరంతో నడుస్తాను”. ఈ నిర్ణయం తీసుకున్నప్పుడు మన ప్రత్యేక ప్రతిభకు మార్గం ఏర్పడుతుంది.

మన పిల్లలకు, యువతకు ఈ రోజున ఏదైనా ఒక కొత్త ప్రతిభను గుర్తించడంలో సహాయం చేస్తే అది ఈ దినోత్సవానికి నిజమైన అర్థం. ఒక చిన్న అవకాశం, ఒక ప్రోత్సాహం, ఒక మంచి మాట చాలాసార్లు ఇవే కొత్త ప్రతిభలకు పుట్టినిల్లు. కోతులు ఎక్కే గుణాన్ని చూసి తీర్పు ఇవ్వడం ఎలా తప్పో, అలాగే మనిషి ఏ విషయం లో బలంగా ఉన్నాడో అదే ప్రతిభ అన్న భావనను పెంపొందించాలి.

మొత్తానికి, మనలో ప్రతి ఒక్కరిలోనూ ఒక ప్రత్యేకమైన కాంతి ఉంది. ఆ కాంతిని మసకబారనివ్వకుండా, మన స్వంత వేగంలో, మన శైలిలో, మన మార్గంలో మెరవాలి. అనేది పండుగ కాదుబీ అది మనపై మనకు ఇచ్చే గౌరవం. మన ప్రత్యేకతకు పెట్టే సంతకం.



ముఖేష్ వీరంటి
సంపాదకులు .తొవ్వ దినపత్రిక

## సామాజిక మాధ్యమాల్లో తప్పుదోవ పట్టించే సమాచారం

## ప్రజాస్వామ్యానికి పెరుగుతున్న ప్రమాదం



### - తప్పుడు సమాచారం వేగం భయంకరం

### - ప్రజల అభిప్రాయాలను మార్చే దాపరిక శక్తి

### - నియంత్రణల అవసరంపై పెద్ద చర్చ

సామాజిక మాధ్యమాలు ప్రజలకు సమాచారాన్ని అందించే ముఖ్య వేదికలుగా ఎదిగినప్పటికీ, వాటిలో విస్తృతంగా వ్యాప్తి చెందుతున్న తప్పుడు విలేఖనం, ఫేక్ న్యూస్, ప్రోపగాండా సందేశాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు తీవ్రమైన సవాలుగా మారాయి. నమ్మకమైన వార్తలకన్నా ఆకర్షణీయంగా కనిపించే తప్పుదోవ పట్టించే కంటెంట్ వేగంగా పాకిపోవడం వల్ల ప్రజలలో గందరగోళం పెరుగుతుంది. ఇది ఎన్నికల మూల్యాలను, పాలనపై నమ్మకాన్ని, సామాజిక సమన్వయాన్ని సైతం దెబ్బతీసే ప్రమాదం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.ప్రస్తుతం ఎక్కువగా యువత, పల్లెల్లోని చిన్న వయసు వినియోగదారులు ఫార్వర్డ్ అయిన సమాచారాన్ని అసలు వాస్తవం తనిఖీ చేయకుండా నమ్ముతున్నారు. దీని వల్ల సామాజిక ఉద్రిక్తతలు, వర్గ విభజనలు, కొన్ని సందర్భాల్లో హింసాత్మక సంఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా ఎన్నికల సంవత్సరాల్లో ఫేక్ న్యూస్ మరింత పెరిగి, ఓటర్లను భావోద్వేగపరచి రాజకీయ ప్రయోజనాలు పొందే ప్రయత్నాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ పరిణామాలు ప్రజాస్వామ్య ఆరోగ్యానికి అత్యంత ప్రమాదకరమని అధ్యయనాలు చెబుతున్నాయి.తప్పుడు సమాచార వ్యాప్తి వెనుక ఉన్న ప్రధాన కారణం ఆల్గోరిథమ్స్ వినియోగదారు ఎక్కువగా చూడగల కంటెంట్‌ను ముందుకు నెడుతూ, వాస్తవాన్ని పక్కనపెట్టి సెన్సేషన్‌కు ప్రాధాన్యం ఇస్తాయి. ఈ విధానంతో తప్పుదోవ పట్టించే పోస్టులు ఎక్కువ రీచ్ పొందుతాయి.






రాజకీయ పార్టీలు, ఆన్‌లైన్ ట్రోల్స్, బాట్స్ సిస్టమ్‌ల వాడకం మరింత ఉద్రిక్తత సృష్టించి, ప్రజల మనోభావాలను మలుపు తిప్పే ప్రయత్నం చేస్తాయి. ప్రజాస్వామ్యానికి ప్రధానమైన పారదర్శకత, సమాచార స్వేచ్ఛ వంటి మూల్యాలు ఈ డిజిటల్ యుగంలో విచ్ఛిన్నం అయ్యే ప్రమాదం పెరుగుతోంది. ప్రజలు నిజమైన సమాచారాన్ని గుర్తించలేని పరిస్థితి ఒక విధంగా వాటి పదునైన తీర్పు శక్తిని కూడా దెబ్బతీస్తోంది. ఎన్నికల ముందు ప్రచారం చేసే డిజిటల్ ప్రకటనలు కూడా వాస్తవాలను వక్రీకరించి ఓటర్లను మభ్యపెట్టేలా తయారు అవుతున్నాయి. ఇది ప్రజాస్వామ్య ప్రక్రియను ప్రభావితం చేసే ప్రధాన ఆయుధంగా మారింది.ఇందుకు ప్రతిస్పందనగా కొన్ని దేశాలు ఫేక్ న్యూస్‌ను నియంత్రించేందుకు చట్టాలు తెచ్చాయి. కానీ మాట స్వేచ్ఛను కాపాడుకుంటూనే, దుష్ప్రచారం నియంత్రణ ఎలా చేపట్టాలి అనేది క్లిష్ట సమస్యగానే ఉంది. టెక్ కంపెనీలు స్వచ్ఛందంగా చర్యలు తీసుకోవడం చాలా సమక్తమైన పరిష్కారం కాదని అనుభవం చెబుతోంది. అంతర్జాతీయ సంస్థలు మాధ్యమ ప్లాట్‌ఫార్మ్‌పై కఠిన నిబంధనలు విజయవంతం చేసేందుకు మార్గాలను పరిశీలిస్తున్నాయి.ప్రజాస్వామ్యాన్ని రక్షించేందుకు మీడియా లిటరసీని బలపరచడం అత్యంత ముఖ్యమైన అంశంగా నిపుణులు సూచిస్తున్నారు. ప్రతి పౌరుడు డిజిటల్ సమాచారాన్ని స్వీకరించే ముందు ధృవీకరించడమే మూల సూత్రంగా అవలంబించాలి. పాఠశాల స్థాయి నుంచే మీడియా అవగాహన విద్యను ప్రవేశపెట్టడం అత్యవసరంగా అవసరం ఉంది. సమాజం మొత్తం నిజానిజాలు తెలుసుకునే శక్తిని పెంచుకున్నప్పుడే ఫేక్ న్యూస్‌కు గట్టి ప్రతిఘటన సాధ్యమవుతుంది.సమగ్రంగా చూస్తే, సామాజిక మాధ్యమాల్లో పెరుగుతున్న తప్పుడు సమాచార ప్రభావం ప్రజాస్వామ్యానికి దీర్ఘకాల ముప్పుగా మారుతోంది. సమాచారం స్వేచ్ఛను కాపాడుతూ, అపనిందా ప్రచారాన్ని నియంత్రించే సమతుల్యత అవసరం. ఇది కేవలం ప్రభుత్వాలు చేయాల్సిన పని కాదు. ప్రతి పౌరుడూ నిజం నిలబడేందుకు తన వంతు పాత్ర పోషించినప్పుడే ప్రజాస్వామ్యం సురక్షితంగా ముందుకు సాగుతుంది.

(ఎం ,రాజేష్ ,శాసన సభ్యుల సహాయకులు పాలకుర్తి)

# ఆరోగ్యం





## దీన్ని తొక్కే కదాని పడేస్తే

అద్భుత లాభాలని కోల్పోతారు?

వెల్లుల్లి తొక్క ఆరోగ్యానికి చాలా రకాలుగా మేలు చేస్తుంది. మనకు పాదాల వాపు సమస్య ఉంటుంది. ఈ సమస్యని ఈజీగా తగ్గించడానికి మార్కెట్లో చాలా రకాల నూనెలు అందుబాటులో ఉన్నప్పటికీ, మీరు వెల్లుల్లి తొక్కను ఉపయోగించడం ద్వారా ఈ నొప్పి నుండి ఉపశమనం లభిస్తుంది. ఉదయం సాయంత్రం వెల్లుల్లి పొట్టులో తేనె వేసుకుని తీసుకుంటే ఆస్తమా నుంచి బయటపడొచ్చు. అలాగే కాళ్ల వాపుల నుండి కూడా వెల్లుల్లి పొట్టు రక్షిస్తుంది. ఇందుకోసం వెల్లుల్లి తొక్కను నీటిలో ఉడకబెట్టాలి. బాగా మరిగిన నీరు గోరు వెచ్చగా ఉన్నప్పుడు మీ పాదాలను ఆ నీటిలో ఉంచండి. క్రమంగా, పాదాల వాపు, నొప్పి నుండి ఉపశమనం పొందుతారు.జుట్టు రాలడం లేదా తెల్ల జుట్టు సమస్యతో బాధపడుతుంటే, వెల్లుల్లి తొక్క నీరు ప్రయోజనకరంగా ఉంటుంది. దీని కోసం, వెల్లుల్లి తొక్కను నీటిలో ఉడకబెట్టి, ఆపై ఈ నీటితో మీ జుట్టును కడగాలి. లేదా స్ప్రే బాటిల్‌లో పోసుకుని జుట్టుకు, మాడుకు బాగా స్ప్రే చేసుకోవాలి. చుండ్రు, పేండ్లు వంటి సమస్యలతో బాధపడేవారు వెల్లుల్లి పేస్ట్‌లో కొంచెం నీళ్లు కలిపి తలకు బాగా పట్టించాలి. మరొక పద్ధతి కూడా ఉంది. వెల్లుల్లి తొక్కను వేయించి పొడి చేసి కొబ్బరినూనెలో కలిపి జుట్టుకు రాసుకుంటే తెల్లజుట్టు వేరు నుండే నల్లగా మారడం ప్రారంభమవుతుంది.వెల్లుల్లి తొక్కను నీటిలో కాసేపు నానబెట్టి ఆ తర్వాత ఈ నీటిని అలర్జీ ఉన్న ప్రాంతంలో అప్లై చేయండి. ఈ రెమెడీని ప్రతిరోజూ చేయడం వల్ల దురద సమస్య నుండి త్వరగా ఉపశమనం పొందుతారు. అంతే కాదు ఇందులోని యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు మొటిమలను తగ్గించడంలో కూడా మేలు చేస్తాయి. ఇంకా వెల్లుల్లి తొక్కను నీటిలో కాసేపు నానబెట్టి ఆ తర్వాత ఈ నీటిని అలర్జీ ఉన్న ప్రాంతంలో అప్లై చేయండి. ఈ రెమెడీని ప్రతిరోజూ చేయడం వల్ల దురద సమస్య నుండి త్వరగా ఉపశమనం పొందుతారు.

## ఖాళీ కడుపుతో కొత్తిమీర నీళ్లు తాగితే..?



కొత్తిమీర నీరు ఎసిడిటీ, పిత్తాను తగ్గించడంలో చాలా మేలు చేస్తుంది. కొత్తిమీరలోని గుణాలు పొట్టకు మేలు చేస్తాయి. కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపులో యాసిడ్ స్థాయి తగ్గుతుంది.ఎసిడిటీ వల్ల వచ్చే మంట, నొప్పి తగ్గుతుంది. కొత్తిమీరలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. ఇది అసిడిటీ వల్ల వచ్చే సమస్యలను తగ్గిస్తుంది. ఉదయాన్నే ఖాళీ కడుపుతో కొత్తిమీర నీరు తాగడం వల్ల కడుపు సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.కొత్తిమీర నీరు మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. కొత్తిమీరలో అధిక పీచు ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. కొత్తిమీర గింజలలో ఉండే థైమోల్ అనే పదార్థం మలబద్ధకం నుండి ఉపశమనం కలిగించే జీర్ణ రసాల స్రావాన్ని పెంచుతుంది. అలాగే, కొత్తిమీర నీటిని తీసుకోవడం వల్ల శరీరంలో నీటి శాతం పెరుగుతుంది. ఇది మలబద్ధకం నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది.బరువు నియంత్రణ, బరువు తగ్గడంలో కొత్తిమీర నీరు ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కొత్తిమీరలో ఉండే ఫైబర్ కడుపు నిండుగా ఉంచుతుంది. ఆకలి దప్పులను తగ్గిస్తుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. బరువు నియంత్రణలో సహాయపడుతుంది. కొత్తిమీరలో ఉన్న పాలీఫెనాల్ యాంటీ ఆక్సిడెంట్లు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. థైరాయిడ్ సమస్యలకు సహజ నివారణగా పనిచేస్తుంది. కొత్తిమీర ఆకులు, కాండం యాంటీఆక్సిడెంట్ లక్షణాలను కలిగి ఉంటాయి. ఇవి సరైన థైరాయిడ్ పనితీరుకు సహాయపడతాయి.

## నెల రోజులపాటు అన్నం తినకపోతే..?

బరువు తగ్గడానికి ప్రజలు చాలా కష్టపడతారు. ఆహార నియంత్రణ కూడా చాలా ముఖ్యం. బరువు తగ్గాలనుకునే వారు నెల రోజులు అన్నాన్ని వదిలేస్తే.. మరికొద్ది రోజుల్లో తేడా మీకే తెలుస్తుంది. బియ్యం వేగంగా కేలరీలను పెంచుతుంది.. జీవక్రియను నెమ్మదిస్తుంది. ఇది పొట్ట కొవ్వు, ఊబకాయాన్ని పెంచుతుంది. మీరు బరువు తగ్గాలనుకుంటే ఒక నెలపాటు అన్నం మానేయండి. మనం ఎక్కువ కార్బోహైడ్రేట్లను తీసుకున్నప్పుడు వాటిని జీర్ణం చేయడానికి మనకు ఎక్కువ చక్కెర అవసరం. అప్పుడు మన శరీరంలో చక్కెర స్థాయి పెరుగుతుంది. శరీరంలో షుగర్ లెవెల్ పెరిగితే మధుమేహం సమస్య తీవ్రమవుతుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు సమస్య పెరుగుతుంది. అలాగే థైరాయిడ్, పీసీఓడీ బాధితులకు కూడా ఇది మంచిది కాదు. ఏదైనా వ్యాధితో బాధపడేవారు శరీరంలో చక్కెర స్థాయిని నియంత్రించడానికి అన్నం తక్కువగా తినాలి. షుగర్ లెవల్స్ అదుపులో ఉంచుకోవాలి.అన్నం తినడం వల్ల బద్ధకం పెరుగుతుంది. తరచుగా నిద్ర వస్తుంది. దీనివల్ల పనిపై ఆసక్తి ఉండదు. కానీ, అన్నం తినడం మానేస్తే శరీరం మునుపటి కంటే చురుగ్గా మారుతుంది. సోమరితనం తగ్గుతుంది. కూర్చున్న, నిలబడినా నిద్ర మత్తు ఉండదు. మీరు ఇంతకు ముందెన్నడూ అనుభవించని అనేక మార్పులను మీరు గమనిస్తారు. శరీరం బరువు తగ్గినట్లు అనిపిస్తుంది. దీంతో మీ మెదడు మరింత చురుకుగా ఉండటం వల్ల మీరు వేగంగా పని చేస్తారు.బియ్యంలో లభించే కార్బోహైడ్రేట్లు మన శరీరానికి శక్తినివ్వడానికి అవసరం. దాన్ని పక్కన పెడితే మనల్ని బలహీనపరుస్తుంది. దీనివల్ల కండరాలు బలహీనపడతాయి. శరీరంలో పోషకాలు, ఖనిజాల లోపం సంభవించవచ్చు. శరీరంలోని కొవ్వును తగ్గించడమే లక్ష్యం కావాలి. కండరాలను బలహీనపరచవద్దు.

https://epaper.thovvanews.in

తొవ్వ

శుక్రవారం-28-11-25

జనరల్ న్యూస్

# సర్పంచ్ బరిలో ఉన్నత విద్యావంతురాలు బండ కళ్యాణి

**సీఎం రేవంత్ పిలుపుతో రాజకీయాల్లోకి ప్రవేశం**



**తోవ్వ, నెల్లికుదురు, నవంబర్ 27**
సమాజంలో ఏ రంగాల్లోనైనా తమ సామర్థ్యాలను చాటుతున్న మహిళలు వంటింటి కుందేల్లు కాదని అంతరిక్షంలో సైతం అడుగుపెట్టి అబ్బురపరుస్తున్న క్రమంలో రాష్ట్రంలో విద్యావంతులైన యువత రాజకీయాల్లోకి రావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపుతో స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మండలంలోని మునిగలవీడులో ఎస్సీ రిజర్వ్ కావడంతో అదే సామాజిక వర్గానికి చెందిన యువతి ఉన్నత విద్య అయిన బీటెక్ విద్యను అభ్యసించి తొలి విడత నామినేషన్ లో భాగంగా గురువారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పరచడమే లక్ష్యంగా పనిచేస్తానని తనకు అవకాశం కల్పించాలని అన్ని వర్గాల ప్రజలను కోరారు.

## రాష్ట్ర స్థాయి జూనియర్స్ ఖో ఖో పోటీలకు ఉప్పరపల్లి విద్యార్థిని కే వర్షిత ఎంపిక .

**చెన్నారావుపేట, నవంబర్ 27 తొవ్వ న్యూస్:**
హనుమకొండ లోని ప్రాక్టీసింగ్ హైస్కూల్లో నవంబర్ 16వ తేదీన వరంగల్ డిస్టిక్ ఖో ఖో అసోసియేషన్వారిఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి జూనియర్స్ ఖోఖోఎంపిక పోటీలలో జడ్పీహెచ్ఎస్ ఉప్పరపల్లి పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న కే వర్షిత అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి ఖొ ఖొ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయ తెలిపారు. ఈ రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలు మెదక్ జిల్లాలోని పటాన్ చెరువులో నవంబర్ 28 వ తేదీ నుండి నవంబర్ 30 వరకు జరుగుతాయని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగోని స్వప్నతెలిపారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత శశిధర్ సంతోష్ కుమార్ మొగిలి ఉదయ్ కుమార్ రామకృష్ణ సతీష్ రమాదేవి సుందర్ క్రాఫ్ట్ టీచర్ ఇందిరా విద్యార్థిని అభినందించారు.

## మండలంలో పోలింగ్ స్టేషన్లను పరిశీలించిన ఎంపిడిఓ దీపిక.



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 27.**
మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల వేళ జిల్లా అధికారుల ఆదేశాలతో గురువారం బయ్యారం మండల ఎంపీడీఓ దీపిక మండలంలోని 26 పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. మండలంలో డిసెంబర్ నెల 14న రెండో విడతలో 29 గ్రామ పంచాయతీ స్థానిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బయ్యారం,అల్లి గూడెం, జగత్ రావు పేట,లక్ష్మీపురం,కస్తూరి నగరం తదితర పోలింగ్ స్టేషన్లను పరిశీలించినట్లు తెలిపారు.మండలంలో 29 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు అలీ,శ్రీధర్,ఉష,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లికుదురు లో సర్పంచ్ స్థానాలకు 30నామినేషన్లు,వార్డ్17 స్థానాలకు నామినేషన్లు



తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 27
మండల వ్యాప్తంగా మొదట విడత స్థానిక ఎన్నికల గాను నామినేషన్ల పర్వం మొదటి రోజు గురువారం కొనసాగింది. సర్పంచ్,వార్డు సభ్యులకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ను దాఖలు చేశారు. 31 గ్రామపంచాయతీలకు గాను 30 నామినేషన్లు దాఖలు కాగా,280 వార్డు స్థానాలు ఉండగా 17 మాత్రమే నామినేషన్ దాఖలు చేశారని ఎంపీడీవో సింగారపు కుమార్ తెలిపారు.నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు ప్రతిపాదించే,బలపరిచే వ్యక్తులకు మాత్రమే సెంటర్లకు అనుమతిచ్చారు.

### గ్రామాలవారీగా సర్పంచ్ నామినేషన్లు...

నైనాల-01,ఎర్రబెల్లిగూడెం-03,నెల్లికుదురు-04,రామన్నగూడెం-02,జామతండ-02,పార్వతమ్మగూడెం-02,దుర్గభవాని తండ-01,వస్రం తండ-01,మునిగలవీడు-01, నరసింహుల గూడెం-03,కాశ్య తండా-01,రాజ్య తండ-01, బంజర-01,బ్రాహ్మణ కొత్తపెల్లి-01,శ్రీరామగిరి-01, ఆలేరు-04,బొటిమిడితండ-01 సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్ వేశారు. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీలో ఆశావాహులు అధికంగా ఉండడంతో అధిష్టానం నిర్ణయంతో అభ్యర్థులు ఖరారు కానున్నారు దీంతో వారు నామినేషన్ కు దూరంగా ఉన్నారు. ప్రతిపక్ష పార్టీలో పోటీ తక్కువగా ఉండడంతో గ్రామాల్లో అత్యధికంగా నామినేషన్లు దాఖలా చేశారు.



# రామన్నగూడెం సర్పంచ్ అభ్యర్థిగా సంధ్యారాణి

**తొలిరోజు నామినేషన్ వేసిన మహిళా నాయకురాలు**



**తొవ్వ,నెల్లికుదురు, నవంబర్ 27**
స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా తొలి విడత నామినేషన్ల ప్రక్రియ ఆరంభమైంది. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కాగా రామన్నగూడెం పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా కాంగ్రెస్ మహిళా నేత చీకటి సంధ్యారాణి నామినేషన్ దాఖలు చేశారు. ఉదయం పదిన్నర గంటల నుంచి సాయంత్రం 5 వరకు నామినేషన్లు స్వీకరించారు. ఈ నెల 29న సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల సమయం ముగుస్తుంది. ఈ నెల 30న నామినేషన్లు పరిశీలించి చెల్లుబాటైన నామినేషన్ల వివరాలు ప్రకటిస్తారు. తిరస్కరించిన నామినేషన్లపై డిసెంబరు 1న అప్పీళ్లు స్వీకరించి మరుసటి రోజున పరిష్కరిస్తారు. డిసెంబరు 3వ తేదీన మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగిసిన తర్వాత పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటించనున్నారు.

# ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడాలి.

## -విధుల నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు.

**-మండల తహశీల్దార్ నాగరాజు.**



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 27.** ప్రతి సీజన్లో ధాన్యం కొనుగోళ్లకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని రైతులకు ఇబ్బందులు కలగకుండా యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు జరగాలని ఎప్పటికప్పుడు రైతుల వివరాలు ఆన్ లైన్ చేయాలని మండల తహశీల్దార్ నాగరాజు సోసైటీ సిబ్బందిని ఆదేశించారు.గురువారం మండలంలోని జగ్గుతండ గ్రామ పంచాయతీ పరిధిలో సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరుగాలం శ్రమించి రైతులు పండించిన పంట నష్టం కాకుండా సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి ధాన్యం కొనుగోలును వేగవంతంచేయాలన్నారు.కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే తేమ శాతం చూసి కొనుగోలు చేయాలని వాతావరణం దృష్ట్యా రైతులు కూడా తేమ శాతం వచ్చాకనే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు.ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలోఅధికారులు కూడా అంతే బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఐలు సందీప్,ఉపేందర్ సెంటర్ ఇంచార్జ్ ముధాకర్,రైతులు పాల్గొన్నారు.

## 42% బీసీ రిజర్వేషన్లు ఇస్తామని చెప్పి మోసం చేశారు



**యాదాద్రి జిల్లా:వలిగొండ: తొవ్వ ప్రతినిధి: నవంబర్ 27**
వలిగొండ మండల కేంద్రంలో బీసీ సంఘం జిల్లా నాయకులు సాయిని యాదగిరి ,పట్టణ అధ్యక్షులు నానాచర్ల రమేష్ ఆధ్వర్యంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు చట్టబద్ధత ఇస్తామని, నమ్మించి ద్రోహం చేశారని అన్నారు .ఈ క్రమంలో షెడ్యూల్ విడుదల చేసి బీసీలకు అన్యాయం చేశారని అన్నారు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసిన, బీసీల ఉద్యమాన్ని ఆపేది లేదని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద పెద్ద ఎత్తున పోరాటం చేసి 42 శాతం రిజర్వేషన్లు సాధించుకుంటామని అన్నారు.

# పార్వతమ్మ గూడెం కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా ఎదల్ల పూలమ్మ

## అభ్యర్థిత్వాన్ని బలపరిచిన సబ్బండ వర్గాల ప్రజలు

**కదిలిన జనం... వేసిన నామినేషన్**

**తోవ్వ, నెల్లికుదురు, నవంబర్ 27**
మండలంలోని పార్వతమ్మగూడెం సర్పంచ్ అభ్యర్థిణి గా గ్రామానికి చెందిన మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎదళ్ల యాదవ రెడ్డి తల్లి ఎదల్ల పూలమ్మ నామినేషన్ దాఖాలు చేశారు.నామినేషన్ సమర్పించడానికి ముందుగా స్థానిక శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో కుటుంబ సభ్యులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,అభిమానులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఎన్నికల అధికారి చంద్ర ప్రకాష్ కు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మాతృమూర్తి తో కలిసి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాదవ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలోని సబండ వర్గాల ప్రజల సహకారంతో ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా గత పది సంవత్సరాలుగా గ్రామ అభివృద్ధికి పదవులు లేకున్నా కృషి చేస్తున్నామని, వారి సంపూర్ణ సహకారంతో మరింత అభివృద్ధి చేయుటకు అవకాశం కల్పించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో , కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు సొంటి రెడ్డి మల్లారెడ్డి,మట్ట నర్సి రెడ్డి, వెంకట్రాంనర్సింహా రెడ్డి,వెంకట్ రెడ్డి,మాజీ ఉప సర్పంచ్ నిదానంపల్లి ప్రవీణ్,వేముల వెంకట్ రెడ్డి,కర్ణాకర్ రెడ్డి,దామోదర్ రెడ్డి,తోట యాకయ్య,పెరుమాండ్ల జగన్, రాములు తో పాటు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# https://epaper.thovvanews.in

సోమవారం 28- 04 - 2025

## జిల్లా వార్తలు



# స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలి.

### -మాజీ ఎమ్మెల్యే హరిప్రియ నాయక్.



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 27.**

బయ్యారం మండలంలోని గంధంపల్లిలో గురువారం బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తాత గణేష్ స్వగృహంలో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఇల్లందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే,పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ భానోత్ హరిప్రియ నాయక్ పాల్గొని మాట్లాడుతూ మండలంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేయాలన్నారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ప్రజలకు తెలుపాలన్నారు.కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి,సంక్షేమాన్ని మరిచిపోయిందని ప్రజలకు వివరించే ప్రయత్నం చేయాలన్నారు.పార్టీ బలోపేతం కోసం పట్టణ స్థాయి నుంచి గ్రామస్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి గెలిపే లక్ష్యంగా ముందుకు పోవాలన్నారు.బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి అంగోత్ బిందు,బానోత్ మురళి కృష్ణ,గంగుల సత్యనారాయణ,లక్ష్మణ్ నాయక్,జక్కుల సునీల్,సతీష్, నాగరాజు,నాగజ్యోతి,కీర్తి ఉదయ్,జెర్పుల శ్రీనివాస్,వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీ వివేకవర్ధిని విద్యార్థులకు సన్మానం



**కేసముద్రం,నవంబర్ 27,తొవ్వ:**

కేసముద్రం మున్సిపాలిటీలోని శ్రీ వివేకవర్ధిని హై స్కూల్ విద్యార్థులు మహబూబాబాద్ లో మంగళ,బుధ వారాలలో జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా సీనియర్స్ విభాగంలో సేంద్రియ ఎరువులు తయారు యంత్రంను ప్రదర్శించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించడమే కాకుండా రాష్ట్ర స్థాయికి ఎంపికైన ఊటుకూరి సాక్షర ను,జూనియర్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ద్వితీయ స్థానాన్ని సాధించిన కుచన వైష్ణవి ని ఘనంగా సన్మానించారు. అనంతరం యాకాంతం గౌడ్ మాట్లాడుతూ... విద్యార్థులలో సైన్స్ పట్ల ఆసక్తిని పెంచడానికి మా పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎంతగానో కృషి చేస్తుందన్నారు.ఉత్తమ ప్రతిభ కనబరచడానికి విద్యార్థులను సిద్ధం చేసిన పాఠశాల సైన్స్ ఉపాధ్యాయుడు విష్ణు ను అభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ చిర్ర నరేష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## భూ హక్కులు లేని,సాగు చేస్తున్న ప్రతి రైతుకు సమగ్ర ఎరువుల యాజమాన్య కార్డులను ఇస్తాం.

### -మండల వ్యవసాయ అధికారి రాజు.





**బయ్యారం,తోవ్వ,నవంబర్ 27.**

మండలంలో భూ హక్కులు లేని సాగు చేస్తున్న ప్రతి రైతు కుటుంబానికి, గిరిజనేతరులకు పంటల నమోదు సమగ్ర ఎరువుల యాజమాన్యం కార్డులను పంపిణీ చేస్తామని మండల వ్యవసాయ అధికారి కే.రాజు అన్నారు. మండలంలోని రామచంద్రపురం గ్రామంలో రైతు వేదికలో భూమి హక్కు లేని సాగు చేస్తున్న రైతులకు రైతు కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాసంగి పంటల సాగు చేస్తున్న ప్రతి రైతుకు సమగ్రంగా ఎరువుల పంపిణీ సక్రమంగా అందే విధంగా చర్యలు ఉంటాయని అన్నారు.రైతులు విత్తన కొనుగోలు బిల్లు,పహాని జిరాక్స్,రేషన్ కార్డు జిరాక్స్,ఆధార్ కార్డు జిరాక్స్, కలర్ ఫోటోతో వ్యవసాయ కార్యాలయనికి సంప్రదించి రైతు కార్డును పొందాలని తెలిపారు.ప్రతి రైతు కుటుంబానికి భూమి ఎంత ఉన్న కార్డు ఒకటి మాత్రమే ఇస్తామని తెలిపారు.దీని వలన రైతులకు ఎరువులు సక్రమంగా అందే విధంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. అదేవిధంగా మండలంలోని రైతులకు సాగు మెలకువలను ఇతర సలహా సూచనలను మండల వ్యవసాయ అధికారి వాట్సప్ ఛానల్ ద్వారా ఎప్పటికప్పుడు సూచనలు,సలహాలు వారి మొబైల్ లో తెసుకొనవచ్చని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఈవోలు నాగరాజు,ఫయాజ్,అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## పలువురిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్...

**తొవ్వ, నర్సింహులపేట, నవంబర్.27.**

డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డి. ఎస్ రెడ్యానాయక్ నర్సింహులపేట మండలంలో ఎన్నికల సన్నాహక సమావేశంలో బిజీబిజీగా గడిపారు. అనంతరం మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు కొండబత్తిని రవికుమార్ భార్య ఇటీవల కాలంలో అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకోగా వారిని పరామర్శించారు. వీరితో పాటు విశ్రాంత ఉద్యోగి సంకపల్లి రాఘవరెడ్డి, రిపోర్టర్ రేఖ ఉపేందర్ మామ ఉదరి యాదగిరి మృతి చెందగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మైదం దేవేందర్,మాజీ వైస్ ఎంపీపీ జాటోతు దేవేందర్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు రవి నాయక్, మండల ప్రధాన కార్యదర్శి సువీర్ రెడ్డి, సీనియర్ నాయకులు నెలకుర్తి సత్తిరెడ్డి, బండ బిక్షం రెడ్డి, సంకపల్లి నరసింహారెడ్డి, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థాన మాజీ చైర్మన్లు మిర్యాల వెంకన్న, బొల్లం రమేష్ బాబు,కొండబత్తిని జగదీశ్వర్, పాతూరు మదురెడ్డి, రమేష్ రెడ్డి,మాజీ మండల యూత్ అధ్యక్షుడు బండి రమేష్,అల్వాల నవీన్, సురేష్, కర్ల నాగన్న, మారపంగు వీరన్న, గుజి వీరస్వామీ తదితరులు పాల్గొన్నారు.



## గంజాయి రవాణా చేసి విక్రయిస్తున్న నిందితులు అరెస్ట్.



**నర్సంపేట, నవంబర్ 27, తొవ్వ న్యూస్:**

నర్సంపేట మండలం లోని చంద్రయ్య పల్లి గ్రామానికి చెందిన 1) బొమ్మెర మహేష్ %o/శీ% సాంబయ్య, వృత్తి : పంపు మెకానిక్, అను అతను ములుగు జిల్లా లోని మల్లంపల్లి లో పంపులు రిపేరు చేసే పని చేస్తుండగా, తాను చేసే పని ద్వారా వచ్చే డబ్బులు తన జల్సాలకు సరిపోక సులువైన మార్గంలో తక్కువ పెట్టుబడితో ఎక్కువ డబ్బులు సంపాదించాలని, ఎలాగైనా గంజాయి కొని దానిని బయట ఇతరురులకు అమ్మాలని అనుకోని తన స్నేహితుడైన నల్లబెల్లి మండలంలోని ఎర్ర చేరువు తాండ నివసుడైన 2) పాద్య రాజు %o/శీ% కొమ్మాలు, వృత్తి : వంట పని, చేయు అతని వద్ద్వా %ఖ+% ఎండు గంజాయిని కొనుక్కొని నర్సంపేటకు తీసుకువచ్చి దాన్ని అమ్మే క్రమంలో ముత్తోజిపేట గ్రామ శివారుకి రాగ, ఎస్సై రవి కుమార్ మరియు సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తుండగా వారిని చూసి భయంతో పారిపోయే ప్రయత్నం చేయగా, పోలీస్ వారు అతని పట్టుకొని తనికి చేయగా 500 gl ఎండు గంజాయి దాని విలువ సుమారు 25,000/- ఉండగా, అతనిని ఎక్కడనుండి తీసుకోస్తున్నావు అని ప్రశ్నించగా పైన తెలిపిన వ్యక్తి దగ్గర కొన్నాను అని తేలుపగా, వెంటనే అతనిని తీస్కొని పైన తెలిపిన వ్యక్తి దగ్గరికి వెల్లి తనికి చేయగా, అతని వద్ద 1 kg ఎండు గంజాయి దొరకడం జరిగింది. వెంటనే వారిద్దరితో పాటు అట్టి 1 ాా %ఖ+% గంజాయి దాని యొక్క విలువ %=o%. 75,000/-, 1 ద్విచక్ర వాహనం మరియు 2 మొబైల్ ఫోన్ లను స్వాదినం చేసుకొని సదరు ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ కు పంపనైనద తెలిపారు

## జిల్లా స్థాయి ఇన్స్పైర్ , విద్యా ,వైజ్ఞానిక ప్రదర్శన లో జెడ్.పి.హెచ్.ఎస్ మహబూబాబాద్

### విద్యార్థుల ప్రతిభ:



**తొవ్వ ,మహబూబాబాద్ , నవంబర్ 21:**

రెండు రోజులపాటు మానుకోట జిల్లా కేంద్రం లోని అనంతారం మోడల్ స్కూల్ లో జరిగిన జిల్లాస్థాయి ఇన్స్పైర్ , సైన్స్ ఫెయిర్ ప్రదర్శనలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మహబూబాబాద్ కు చెందిన విద్యార్థులు గైడ్ టీచర్ ఆర్ సునీత అధ్వర్యంలో పాల్గొనిఇన్స్పైర్ లో రాష్ట్ర స్థాయి కి ఎంపిక కావడంతో పాటు అధిక బహుమతుల గెలుచుకున్నారు.కూరపాటి సాత్విక ఇన్స్పైర్ లో "అడాప్టింగ్ పర్కోలేషన్ టెక్నాలజీ ఇన్ డ్రైనేజ్ సిస్టమ్ " అనే అంశం లో రాష్ట్ర స్థాయి కి ఎంపిక అయ్యింది. డి ఎల్ ఇ పి సి %ఉ% ఆర్ ఎస్ బి వి పి లో జి. దీప్తి సాయి "మస్కిటో రిపెల్లెంట్ ధూప్ స్టిక్స్ ", కె. మిన్ను "సహజ పద్ధతిలో పార్థీనియం మొక్కల నివారణ" మరియు జి. జీవన్ సాయి "నేచురల్ శానిటైజర్" అనే అంశాలలో బహుమతులు సాధించారు.ఈ సందర్భంగా విద్యార్థులని మరియు గైడ్ టీచర్ ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,ఉపాధ్యాయిని ఉపాద్యాయులు అభినందించారు.